ప్రజాపక్షం

జిల్లా అనుబంధం

కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

శుక్రవారం | 15 మే, 2026 | పేజీలు : 08


# ధాన్యం అమ్మేందుకు కేంద్రానికి వెళ్తున్నారా ?

### హామాలీ డబ్బులు ఎవరు చెల్లించాలి ?
### రైతులకు ఏలాంటి సౌకర్యాలు ఉంటాయి ?



**ప్రజాపక్షం / నిర్మల్ :** యాసంగి సీజన్‌లో వరి కోతలు ఊపందుకోవడంతో తెలంగాణ వ్యాప్తంగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు రైతులతో కళకళలాడుతున్నాయి. గ్రామాలకు దగ్గరగా ఏర్పాటు చేసిన, ఐకేపి, ఫ్యాక్స్, ఎప్.ఎస్.సి.ఎస్. కేంద్రాలకు రైతులు ట్రాక్టర్లలో ధాన్యం తీసుకువస్తున్నారు. అయితే ప్రతి ఏడాది మాదిరిగానే ఈసారి కూడా "హమాలి డబ్బులు రైతే ఇవ్వాలా" ? తేమ ఎక్కువగా ఉంటే ఏమవుతుంది ? డబ్బులు ఎప్పుడు ఖాతాలో పడతాయి ? అనే సందేహాలు రైతులను వెంటాడుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ కొనుగోలు విధానం, రైతులకు ఉన్న హక్కులు, కేంద్రాల్లో కల్పించాల్సిన సౌకర్యాలపై స్పష్టత అవసరమైంది. హమాలీ డబ్బులపై స్పష్టమైన నిబంధనలు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి ఏలాంటి అక్రమ వసూళ్ళు చేయొద్దని ఇప్పటికే అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి. ధాన్యం, దిగింపు, ఎత్తివేత, తూకం పనుల కోసం పనిచేసే హమాలీల ఖర్చు సాధారణంగా కొనుగోలు సంస్థల పరిధిలోనే ఉండాలని అధికారులు చెబుతున్నారు. రైతులపై అధనపు భారం వేయడం నిబంధనలకు విరుద్ధమని స్పష్టం చేస్తున్నారు. అయినప్పటికీ కొన్ని ప్రాంతాల్లో రైతులే స్వచ్ఛందంగా హమాలీలకు డబ్బులు ఇస్తున్నా పరిస్థితులు కనిపిస్తున్నాయి. బలవంతంగా డబ్బులు అడిగితే వెంటనే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచిస్తున్నారు. తేమ ఎక్కువైతే కొనుగోలు ఆలస్యం కొనుగోలు కేంద్రానికి రైతు ధాన్యం తీసుకురాగానే ముందుగా తేమ శాతం పరీక్షిస్తారు. ప్రభుత్వం నిర్ణయించిన ప్రమాణాల ప్రకారం తేమ 17 శాతం లోపు ఉండాలి. ధాన్యంలో మట్టి, చెత్త, రాళ్ళు లేకుండా శుభ్రంగా ఉండాలని అధికారులు చెబుతున్నారు. సరిగా ఆరబెట్టని ధాన్యాన్ని తీసుకువస్తే కొనుగోలు ఆలస్యం కావచ్చని హెచ్చరిస్తున్నారు. తేమ ఎక్కువగా ఉంటే నిల్వ సమయంలో ధాన్యం నాణ్యత దెబ్బ తినే అవకాశం ఉండటంతో ఈ నిబంధనలను కఠినంగా అమలు చేస్తున్నారు. తూకం నుంచి డబ్బుల జమ వరకు ఇదే ప్రక్రియ ధాన్యం పరిశీలన పూర్తయ్యాక డిజిటల్ తూకపు యంత్రాలతో తూకం వేస్తారు. అనంతరం రైతుకు రసీదు ఇస్తారు. ఆ తర్వాత ధన్యాన్ని మిల్లులకు తరలించి, నిర్ధారణ పూర్తయిన తర్వాత రైతు బ్యాంకు ఖాతాలో నేరుగా డబ్బులు జమ చేస్తారు. చెల్లింపులు త్వరగా పూర్తయ్యేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. కేంద్రాల్లో రైతులకు కల్పించే సౌకర్యాలు రైతులకు కేంద్రాల్లో గన్నీ సంచులు, టార్పలిన్లు, తాగునీరు, నీడ, కర్రెంటే సౌకర్యం తేమ కొలిచే యంత్రాలు, తూకపు యంత్రాలు అందుబాటులో ఉంచాలని ప్రభుత్వం ఆదేశించింది. వర్షం వస్తే ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కూడా సూచించింది. తప్పనిసరిగా తీసుకురావాల్సిన పత్రాలు ఆధార్‌కార్డు, బ్యాంకు పాస్‌బుక్, రైతుపాస్‌బుక్ వివరాలు తప్పనిసరిగా వెంట తీసుకురావాలని అధికారులు చెబుతున్నారు. నమోదు చేసిన రైతుల ఖాతాల్లోకి నేరుగా చెల్లింపులు జరుగుతాయని స్పష్టం చేస్తున్నారు.

రైతులకు అధికారుల సూచనలు

రైతులు పూర్తిగా ఆరబెట్టిన ధాన్యాన్ని మాత్రమే కేంద్రాలకు తీసుకురావాలని ఎవరైనా అక్రమంగా డబ్బులు అడిగితే వెంటనే ఫిర్యాదు చేయాలని అధికారులు సూచిస్తున్నారు. ప్రభుత్వం మద్దతు ధర రైతుకు పూర్తిగా అందేలా చర్యలు తీసుకుంటున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో నిబంధనలు ఎంతవరకు అమలవుతున్నాయన్నదే ఇప్పుడు ప్రధాన చర్చగా మారింది.

## ఆర్ &బి శాఖ అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి

**ప్రజాపక్షం/పెద్దపల్లి:**జిల్లాలో ఆర్ & బీ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి పనులను నిర్దేశిత గడువుల్లోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అధికారులను ఆదేశించారు.బుధవారం ఐడిఓసి కార్యాలయంలో ఆర్ & బీ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో కొనసాగుతున్న రహదారులు,భవనాల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు.పనుల అమలులో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమన్వయంతో పనులు నిర్వహించాలని తెలిపారు.టెండర్ దశలో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు.టెండర్ల ఖరారులో జాప్యం లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజా అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రాధాన్యతా క్రమంలో పనులు చేపట్టాలని సూచించారు.మెడికల్ కళాశాల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి సంబంధిత శాఖకు అప్పగించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మంథని గెస్ట్ హౌస్ నిర్మాణ పనులను నిర్దేశిత 9 నెలల గడువులో పూర్తి చేయాలని సూచించారు.పనులు జరుగుతున్న ప్రాంతాల్లో భద్రతా చర్యలు తప్పనిసరిగా పాటించాలని, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.పెండింగ్ బిల్లులు, భూసేకరణ, విద్యుత్ లైన్ మార్పిడి వంటి సమస్యలను సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని త్వరగా పరిష్కరించాలని సూచించారు. అభివృద్ధి పనుల పురోగతిపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని, వారంవారీగా నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో ఆర్ & బీ ఈఈ భావ్ సింగ్,సీపీఓ రవీందర్,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



కలెక్టర్ కోయ శ్రీ హర్ష

## మొక్కజొన్న కొనుగోలు కేంద్రంలో కలెక్టర్ తనిఖీ



**ప్రజాపక్షం/నిజామాబాద్ :**మోపాల్ మండలం శ్రీరాంగర్ తండాలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం తనిఖీ చేశారు. రూరల్ మండలం శ్రీనగర్ శివారులోని గోడౌన్‌ను సైతం కలెక్టర్ సందర్శించారు. ముందుగా కొనుగోలు కేంద్రంను తనిఖీ చేసి రైతులకు అందుబాటులోని సదుపాయాలు పరిశీలించారు. మొక్కజొన్న పంట నాణ్యత, తేమ శాతంను స్వయంగా పరిశీలించిన కలెక్టర్, ఎలక్ట్రానిక్ వేయింగ్ మిషన్ ద్వారా తూకం సరిగా చేస్తున్నారా లేదా అన్నది గమనించారు. ఇప్పటివరకు ఎన్ని క్వింటాళ్లు మొక్కజొన్న కొనుగోలు పూర్తయింది, ఇంకా ఎంత పరిమాణంలో పంట సేకరణ జరగాల్సి ఉందని తదితర వివరాలు అడిగి తెలుసుకుని, అధికారులకు సూచనలు చేశారు. రైతులు పంట ఉత్పత్తులు కేంద్రానికి తెచ్చిన వెంటనే నాణ్యతా ప్రమాణాలకు లోబడి ఉంటే వెంటనే తూకం వేయించాలన్నారు. సేకరించిన పంటను వెంట వెంటనే గోడౌన్లకు తరలించాలని ఆదేశించారు. అకాల వర్షాలు కురిస్తే ఇబ్బందులు తలెత్తే ప్రమాదమున్నందున త్వరితగతిన మొక్కజొన్న నిల్వలను గోడౌన్లకు తరలించి జాగ్రత్తగా భద్రపర్చాలని ఆదేశించారు. అవసరమైన సంఖ్యలో హమాలీలను సమకూర్చుకుని మొక్కజొన్న రవాణాలో జాప్యానికి తావు లేకుండా సరిపడా లారీలు అందుబాటులో ఉండేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని సూచించారు. అనంతరం శ్రీనగర్‌లోని గోడౌన్‌ను కలెక్టర్ సందర్శించారు. మొక్కజొన్న నిల్వల బస్తాలను భద్రపరుస్తున్న విధానాన్ని పరిశీలించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ రేఖానాయక్, ఎంపీడీఓ నరేష్, మార్క్‌ఫెడ్ సిబ్బంది భాస్కర్ తదితరులు న్నారు.


## ధాన్యం లిఫ్టింగ్‌లో జాప్యంలేకుండా చర్యలు



జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు, లిఫ్టింగ్ ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అధికారులను ఆదేశించారు

వివరాలు మెయిన్‌లో...

# స్వార్థ రాజకీయాలు మానుకోవాలి

## బిజెపి జగిత్యాల నియోజకవర్గ ఇన్‌చార్జీ శ్రావణి




**ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ :** ఇప్పటికైనా స్వార్థ రాజకీయాలు చేయడం ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ మానుకోవాలనిబిజెపి జగిత్యాల నియోజకవర్గ ఇన్‌చార్జి బోగ శ్రావణి పేర్కొన్నారు. గురువారం జగిత్యాల జిల్లా కేంద్రంలో శ్రావణి విలేకరులతో మాట్లాడారు.గత రెండు రోజుల క్రితం ఓ సమావేశంలో డాక్టర్ సంజయ్ కేంద్ర విద్యాలయాల ఏర్పాటు పైన చేసిన అనుచిత వ్యాఖ్యలకు ఆమె కౌంటర్ ఇచ్చారు.తాము నిజాలు చెప్పినప్పటికీ జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పొంతన లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు.నిజామాబాద్ ఎంపి ధర్మపురి అరవింద్ కేంద్రాన్ని ఒప్పించి ఇక్కడ కేంద్ర విద్యాలయం ఏర్పాటు చేయడానికి మంజూరు తీసుకువస్తే అదేమి ఇక్కడ విద్యార్థులకు అవసరం లేనట్టు ఎమ్మెల్యే ప్రవర్తించడం సరికాదన్నారు. సిబిఎస్‌సి విద్యను ఇక్కడ విద్యార్థులకు దూరం చేసే కుట్రను స్థానిక ఎమ్మెల్యే పన్నుతున్నట్లు తమకు అనుమానం ఉందన్నారు. ఇక్కడ పాఠశాల ఏర్పాటు జరిగితే ఎక్కడ కేంద్ర ప్రభుత్వానికి, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్‌కు, బిజెపి నేతలకు మంచి పేరు వస్తుందోనని భయంతో ఇక్కడి ఎమ్మెల్యే ఉన్నారని పేర్కొన్నారు. ఇటీవల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ఇచ్చిన ప్రెస్ మీట్ చూస్తే అసలు ఇక్కడ కేంద్ర విద్యాలయం ఎందుకు మంజూర అయిందోనని బాధతో ఉన్నట్లు స్పష్టంగా కనిపిస్తుందని అన్నారు. కేవలం రాష్ట్ర ప్రభుత్వం మాత్రమే మంజూరు చేస్తున్న పాఠశాలలే మంచివని, కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసే పాఠశాలలు అసలు తమకు అక్కర్లేదన్నట్లుగా ఎమ్మెల్యే తీరు స్పష్టంగా కనిపిస్తుందన్నారు. కేంద్ర విద్యాలయ ఏర్పాటను అడ్డుకుంటున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ మరి రాతపూర్వకంగా తమ నియోజకవర్గానికి కేంద్ర విద్యాలయం అవసరం లేదని స్పష్టంగా రాసివ్వాలని సవాల్ విసిరారు.తమకు నియోజకవర్గ ప్రజలు, విద్యార్థుల సంక్షేమం ముఖ్యం కాబట్టే ఇక్కడ ఏర్పాటు చేస్తున్న కేంద్ర విద్యాలయానికి స్థలం కేటాయించాలని కోరుతూ నిజామాబాద్ ఎంపి ధర్మపురి అరవింద్ ఆధ్వర్యంలో నిరాహార దీక్షకు దిగుతున్నామని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో ఉన్న ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందాలని తమ తాపత్రయ పడుతుంటే దీని అడ్డుకోవడానికి ఎమ్మెల్యే ప్రయత్నిస్తుండడం సరికాదన్నారు.రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన పాఠశాలకు 25 ఎకరాల అయినా సరే కేటాయించిన ఎమ్మెల్యే కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన పాఠశాలకు మాత్రం 10 ఎకరాల స్థలం కేటాయించలేకపోతున్నారని విమర్శించారు. ఎమ్మెల్యే సంజయ్ చిట్ట మొత్తం తమ వద్ద ఉందని, అది విప్పితే నియోజకవర్గంలో తలెత్తుకొని ఉండలేరని వివరించారు. చిట్టా విప్పాల అని సవాల్ విసిరారు.ఈ సమావేశంలో జగిత్యాల పట్టణ అధ్యక్షులు కొక్కు గంగాధర్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వేముల శ్రీనివాస్,అర్బన్ మండల అధ్యక్షులు రామ్ రెడ్డి కార్యకర్తలు పాల్గొన్నారు.

# కస్తూర్బా గాంధీ విద్యాలయంలో అడ్మిషన్లకై దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :**సుల్తానాబాద్ మండలం, భూపతిపూర్ కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయంలో 202627 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆరవ తరగతి అడ్మిషన్లు ప్రారంభమైనవి అని స్పెషల్ ఆఫీసర్ స్వప్న తెలిపారు.ఐదవ తరగతి పూర్తయిన విద్యార్థినిలు ఆరవ తరగతి ఇంగ్లీష్ మీడియం లో హాస్టల్ తో పాటు అడ్మిషన్ పొందుటకు భూపతిపూర్ లో గల కస్తూర్బా గాంధీ విద్యాలయం పాఠశాలకు వచ్చి నేరుగా అడ్మిషన్లు తీసుకోగలరని స్పెషల్ ఆఫీసర్ స్వప్న తెలియజేశారు.

# ఓటరు జాబితాలో అక్రమాలకు తావుండొద్దు: తహసీల్దార్



**ప్రజాపక్షం/ఎడపల్లి:**ఓటరు జాబితా రూప కల్పనలో పారదర్శకత అత్యంత ముఖ్యమని, క్షేత్రస్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండి ఎలాంటి తప్పులు లేని పక్కా జాబితాను సిద్ధం చేయాలని నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండల తహసీల్దార్ దత్తాత్రి ఆదేశించారు. గురువారం ఎడపల్లి మండలం జాన్కంపేట్ గ్రామంలో ఎస్ఐఆర్ 2025 నమోదు కార్యక్రమంలో భాగంగా ఆయన గ్రామ పంచాయతీలో ఓటర్ల వివరాలను స్వయంగా పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ.. ప్రస్తుతం ఉన్న ఓటరు జాబితాను 2002నాటి రికార్డులతో అను సంధానిస్తున్నట్లు తెలిపారు. పాత రికార్డులతో పోల్చి చూడటం ద్వారా ఓటరు సమాచారాన్ని ఖచ్చితంగా ధృవీ కరించవచ్చని, దీని వల్ల బోగస్ ఓట్లను ఏరివేసే అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఓటరు జాబితా ప్రక్షాళనలో భాగంగా అర్హులైన ఓటర్ల సంతానం వివరాలను సేకరించి, రికార్డులో నిక్కచ్చిగా నమోదు చేయాలన్నారు. ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సుంచనకోట అనురాధ కిషన్ గౌడ్, ఉప సర్పంచ్ కృష్ణ, వార్డు సభ్యులు, రెవెన్యూ సిబ్బంది, జిపి అధికారులు, బిఎల్ఓ లు పాల్గొన్నారు.

# సుల్తానాబాద్ సిఐని సన్మానించిన బిఆర్ఎస్ నాయకులు

**ప్రజాపక్షం/సుల్తానాబాద్:** సుల్తనాబాద్ మండల బిఆర్ఎస్ నాయకులు సుల్తానాబాద్ సర్కిల్ స్టేషన్ నూతన సీఐగా బాధ్యతలు స్వీకరించిన పి.రంజిత్ రావు మర్యాద పూర్వకంగా కలిసి స్వాగతం పలికి సన్మానించారు.ఈ సందర్భంగా సిఐ పి.రంజిత్ రావు మాట్లాడుతూ సుల్తానాబాద్ మండల పట్టణ వ్యాప్తంగా శాంతి భద్రతల పరిరక్షణకు సహాయ సహకారాలు అందించాలని మండల బిఆర్ఎస్ నాయకులను కోరారు. ఈ కార్యక్రమంలో గర్రపల్లి పాక్ చైర్మన్ జూపల్లి సందీప్ రావు,మండల కన్వీనర్ బోయినీ రాజమల్లు, బిసిసంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు తాళ్ళపల్లి మనోజ్ గౌడ్,మాజీ ఎంపిటిసి సూర శ్యామ్, సుద్దాల సర్పంచ్ ఒజ్జ సంపత్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ అందరి బాధ్యత

## డిఆర్‌డిఒ సాయన్న



**ప్రజాపక్షం/ఎడపల్లి:**ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట, విద్యా వారోత్సవాల్లో భాగంగా స్థానిక జాన్కంపేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను డిఆర్‌డిఒసాయన్న సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ పెద్దలను ఉద్దేశించి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో చదువుకొని మేమందరం నేడు ఉన్నత స్థానాల్లో ఉన్నామని, ప్రభుత్వ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఆయన గుర్తు చేశారు. ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత కేవలం ప్రభుత్వం పైనే కాకుండా, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులపై కూడా ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల మౌళిక సదుపాయాలను కల్పిస్తుందని, బడుగు బల హీన వర్గాల పిల్లలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని విద్యావంతులు కావాలని పిలుపునిచ్చారు. గ్రామ పెద్దలందరూ చొరవ తీసుకొని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు పాఠశాలల పరిపుష్టికి కృషి చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలే పేద విద్యార్థుల పాలిట సరస్వతీ నిలయాలు, వీటిని బలోపేతం చేయడం ద్వారానే సమాజంలో గొప్ప మార్పు సాధ్యమవుతుందని డీఆర్‌డీఓ సాయన్న పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జోన్స్, జాన్కంపేట్ సర్పంచ్ అనురాధ, ఉప సర్పంచ్ కృష్ణ, వార్డు సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నరసింహ స్వామి ఆలయంలో అమావాస్య శనివారం ఏర్పాట్లు పూర్తి

**ప్రజాపక్షం/ఎడపల్లి:**శనివారం అమావాస్య పురస్కరించుకొని రేపు జిల్లా నలుమూలల నుంచే కాకుండా మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి విచ్చేయనున్న భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లను పూర్తి చేస్తున్నట్లు ఆలయ ఇన్‌ఛార్జి కార్యనిర్వహణాధికారి వేణు తెలిపారు. ఎడపల్లి మండలం జాన్కంపేట్ గ్రామ శివారు గల శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో రేపు శనివారం స్వామి వారిని దర్శించుకుంటారు. దక్షణ భారత దేశంలోనే ప్రసిద్ధ గాంచిన అష్టముఖి కొనేరులో భక్తులు తరలివచ్చి పుణ్య స్నానాలు ఆచరించి నరసింహ స్వామిని దర్శించుకుంటే భక్తుల సకల పాపాలు హరించబడతాయని ఆలయ ఈఓ సూచిస్తున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఆలయ సిబ్బంది ఏర్పాట్లను చేస్తున్నారు.పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

# వికలాంగులకు బ్యాటరీ సైకిళ్ల పంపిణీ

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని చిల్వాకోడూర్ గ్రామానికి చెందిన సికినికాంతం రవి ,కాంపల్లి రాజయ్య అను వికలాంగులకు గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశాల మేరకు గురువారం సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు , స్థానిక సర్పంచ్ దాసరి తిరుపతిలో గౌడ్ బ్యాటరీ సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం వికలాంగులకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నదన్నారు. అనంతరం లబ్ధిదారులు మాట్లాడుతూ వికలాంగులమైన మాకు మా అవసరాల రీత్యా ఎక్కడికైనా వెళ్లడానికి ఇబ్బంది అవుతుందని మంత్రి కి చెప్పగానే మా సమస్యను గుర్తించి మాకు బ్యాటరీ సైకిల్ ఇచ్చినందుకు మంత్రికి ,సర్పంచ్‌కు నాయకులకు కృతజ్ఞతలు తెలిపినారు. గ్రామ ఉపసర్పంచ్ దీటి మహేష్ ,పంచాయతీ కార్యదర్శి రావిరాజు, వార్డు సభ్యులు కంపెల్లి మనీషా శ్రీకాంత్,తోట్ల సంధ్యారాణి సురేష్,కూన స్వప్న రాజేందర్,తాండ్ర స్వామి,కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు గుండి బుజ్జన్న,గౌడ సంఘం అధ్యక్షుడు తాండ్ర చెన్నయ్య,మాజీ ఎంపిటిసి మహబూబ్,గంధం తదితరులు పాల్గొన్నారు.

# ఆర్అండ్‌బి ఉక్కుపాదం.. రోడ్డు పక్కన షెడ్ల తొలగింపు

## ముందస్తు సమాచారం ఇవ్వలేదని వ్యాపారస్తుల ఆవేదన

## ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసమేనన్న ఎసిపి మస్తాన్ అలీ



**ప్రజాపక్షం/ఎడపల్లి:**నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలంలోని జాన్కంపేట్, ఎంఎస్సీ ఫారం గ్రామాల్లో రోడ్డు పక్కన ఉన్న అక్రమ నిర్మాణాలపై రోడ్డు భవనాల శాఖ అధికారులు గురువారం కొరడా ఝుళిపించారు. నిజామాబాద్‌బోధన్ ప్రధాన రహదారిపై వ్యాపార సముదాయాల ముందు ట్రాఫిక్‌కు ఆటంకంగా ఉన్నాయని రేకుల షెడ్లను భారీగా పోలీస్ బందోబస్తు మధ్య జేసీబీలతో తొలగించారు. ఈ చర్యతో జాన్కంపేట్ గ్రామంలో 2015నాటి పరిస్థితులు పునరావృత్తమయ్యాయి.

ఈ సందర్భంగా బోధన్ ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ ఆలీ మాట్లాడుతూ.. బాసర సరస్వతి క్షేత్రానికి, మహారాష్ట్రకు వెళ్లే ఈ జాతీయ రహదారిపై నిత్యం వేలాది వాహనాలు తిరుగుతుంటాయని తెలిపారు. వ్యాపార సంస్థల ముందు అక్రమంగా ఏర్పాటు చేసిన షెడ్ల వలన వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగి, తరచూ ప్రమాదాలు జరగుతున్నాయని పేర్కొన్నారు. పోలీస్ కమీషనర్ ఆదేశాల మేరకు ప్రమాద రహిత రహదారులుగా తీర్చిదిద్దేందుకు ఈ తొలగింపు ప్రక్రియ చేపట్టినట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమం ఎడపల్లి వరకు కొనసాగుతుందని స్పష్టం చేశారు.

**ముందస్తు సమాచారం ఇవ్వలేదు...**

అధికారుల తీరుపై స్థానిక వ్యాపారస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం ముందస్తు సమాచారం ఇవ్వకుండా , గడువు విధించకుండా నిర్ధాక్షణ్యంగా షెడ్లను కూల్చివేయడం అన్యాయమని వారు వాపోయారు. వేలాది రూపాయాలు ఖర్చు చేసి ఎండ వానల నుంచి రక్షణ కోసం షెడ్డు వేసుకున్నామని, ముందుగా చెబితే తామే తొలగించుకునే వాళ్లమని, ఇలా హఠాత్తుగా వచ్చి ధ్వంసం చేయడం వల్ల భారీగా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు.

**2015 నాటి గాయాలు ఇంకా పచ్చిగానే...**

ఈ సందర్భంగా 2015నాటి రోడ్డు వెడల్పు కార్యక్రమాన్ని జాన్కంపేట్ వాసులు గుర్తు చేసుకున్నారు. అప్పట్లో ఇళ్లను కూల్చి వేసిన అధికారులు బాధితులకు ఇళ్ల స్థలాలు ఇస్తామని చెప్పి కేవలం ఫేక్ పట్టాలు ఇచ్చి చేతులు దులుపుకున్నారని వారు విమర్శించారు. నేటికి ఏ ఒక్క బాధితుడికి స్థలం చూపించలేదని, అధికారుల మాటలు నీటి మూటలుగానే మిగిలిపోయాయని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో బోధన్ ఏసీపీ శ్రీనివాస్, రూరల్ సిఐ విజయ్ బాబు, ఎడపల్లి ఎస్సై రమా, ట్రాఫిక్ ఎస్సైలు, భారీ సంఖ్యలో పోలీస్ సిబ్బంది పాల్గొని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పర్యవేక్షించారు.

# ధాన్యం సేకరణలో వేగం పెంచాలి



**ప్రజాపక్షం/భీమ్‌గల్ రూరల్ :**మండల తహసీల్దార్ కిరణ్‌కుమార్ ఎంపిడిఒ సంతోష్‌కుమార్ గురువారం పలు గ్రామాల సొసైటీ, ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతులకు ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రాలకు వచ్చిన వరిధాన్యాన్ని ఎప్పటికప్పుడు సేకరించి తరలించేందుకు పక్కా ప్రణాళిక అమలు చేయాలని సెంటర్ ఇన్‌చార్జి లకు కోరారు. వరి కొనుగోలు కేంద్రాల వివరాలు తీసుకుని, సెంటర్‌లో నిల్వ ఉన్న సంచులకు అవసరమైన లారీలను అందించుటకు పై అధికారులకు వివరాలను పంపిం చామన్నారు. రైతులు సర్పంచ్‌లు, గ్రామస్తులు ఉన్నారు.

## అంగన్వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం పంపిణీ

**ప్రజాపక్షం/ధర్మపురి :** ధర్మపురి పురపాలిక పరిధిలోని 12, 13వ వార్డులలోని అంగన్వాడీ కేంద్రాల్లో 13వ వార్డు కౌన్సిలర్ చీపిరిశెట్టి రాజేష్,12వ వార్డ్ కౌన్సిలర్ చుక్క సంధ్య భీమరాజ్ పాల్గొని చిన్నారులు, గర్భిణీలు,బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లల ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు పౌష్టికాహారం ఎంతో అవసరమని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.అలాగే చిన్నారుల ఆరోగ్యం, విద్యాభివృద్ధి కోసం తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, స్థానిక ప్రజాప్రతిని ధులు, మహిళలు,వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కృషితో ట్రై సైకిల్ అందజేత

**ప్రజాపక్షం/మల్లాపూర్ :** ఓబులాపూర్ గ్రామానికి చెందిన కోటగిరి లింగన్న అనే వికలాంగుడికి ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అండగా నిలిచారు. ఈ మేరకు ఎమ్మెల్యే చొరవతో మంజూరైన ట్రై సైకిల్ ను గురువారం లింగన్నకు స్థానిక సర్పంచ్ తోట మాధురి రాజిరెడ్డి అందజేశారు. ట్రై సైకిల్ మంజూరికి కృషి చేసిన ఎమ్మెల్యేకు, స్థానిక నాయకులకు లింగన్న ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అలిశెట్టి రవి,నాయకులు దొంతుల రాజు,విజయ్,పందేన శేఖర్, తదితరులు ఉన్నారు.

## పెద్ద హనుమాన్ జయంతి ఉత్సవాల ఆదాయం రూ.కోటి 74 లక్షలు

**ప్రజాపక్షం/మల్యాల:**జగిత్యాల జిల్లా మల్యాల మండలం కొండగట్టులో మూడు రోజుల పాటు నిర్వహించిన హనుమాన్ పెద్ద జయంతి ఉత్సవముల సందర్భరంగా వివిధ టిక్కెట్ల ద్వారా 1కోటి 74 లక్షల 18 వేల 905 రూపాయల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఇఒ అంజనా రెడ్డి పత్రిక ప్రకటనలో తెలిపారు.లడ్డు ప్రసాదముల ద్వారానగదు 99,79,525, పులిహోర ప్రసాదములు, 15,41,380దీక్ష విరమణలు,32,66,600కేశ ఖండన 8,37,200 శీఘ్ర దర్శనము 17,94,200 విక్రయాల ద్వారా ఈ ఆదాయం వచ్చిందన్నారు.గత సంవత్సరము ఆదాయము కంటే ఈ సంవత్సరము సుమారు 24 లక్షల ఆదాయము అధికంగా వచ్చినట్లు ఆయన తెలిపారు .

## హమాలీ కార్మికులకు ఒఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ

**ప్రజాపక్షం/ముత్తారం :** ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ముత్తారం మండలంలోని హరిపురం గ్రామంలో హమాలీ కార్మికులకు గురువారం ఒఆర్ఎస్ ప్యాకెట్లను గ్రామ సర్పంచ్ మెంగాని సమత తిరుపతి ఆస్పత్రి సిబ్బందితో కలిసి పంపిణీ చేశారు.సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఎండల్లో పని చేసేటప్పుడు కార్మికులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, డిహైడ్రేషన్‌కు గురికాకుండా ఒఆర్ఎస్ ద్రావణం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. గ్రామ సర్పంచ్ మెంగని , వార్డు మెంబర్, ఏఎన్ఎం ,ఆశా కార్య కర్తలతో పాటు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లు వేగవంతం.....కటింగ్‌లు ఆపాలి

### మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

**ప్రజాపక్షం /పెగడపల్లి :** గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేవని, కానీ ప్రస్తుత రేవంత్ రెడ్డి పాలనలో రైతాంగం తీవ్ర అవస్థలు పడుతోందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆరోపించారు. పెగడపల్లి మండలం కీచులాటపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన గురువారం పరిశీలించారు. కల్లాల్లో ఉన్న ధాన్యం కుప్పలను చూసి, రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ పొలాల్లో ధాన్యం కుప్పలు తెప్పలుగా పోసి ఉందని,అకాల వర్షాల భయంతో రైతులు అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని వేచి చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాలకు లారీలు సకాలంలో రాకపోవడం వల్లనే ఈ జాప్యం జరుగుతోందని మండిపడ్డారు. దీనికి తోడు మిల్లుల దగ్గర ఒక బస్తాకు సగటున 3.2 కేజీల చొప్పున (క్వింటాల్‌కు 7.5 కేజీలు) తరుగు పేరిట కటింగ్ చేస్తున్నారని, ఇది రైతులను నట్టేట ముంచడమేనని విమర్శించారు.ధాన్యం కల్లాల్లో పోసి నెల రోజులు గడుస్తున్నా ప్రభుత్వానికి పట్టింపు లేదని ఆయన దుయ్యబట్టారు. ధర్మపురి నియోజకవర్గ మంత్రి, జిల్లా కలెక్టర్, కాంగ్రెస్ నాయకులు రైతుల ఇబ్బందులను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ దుస్థితి కీచులాటపల్లి గ్రామానికే పరిమితం కాలేదని,రాష్ట్రమంతా ఇదే పరిస్థితి ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ముందు రైతు డిక్లరేషన్ పేరుతో 36 హామీలు ఇచ్చి, వాటిలో ఒక్కటి కూడా అమలు చేయలేదని గుర్తు చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ నాయకత్వంలో రైతులకు సాగునీరు, 24 గంటల ఉచిత విద్యుత్, సకాలంలో పెట్టుబడి సాయం, ఎరువులు అందాయని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆ వ్యవస్థలన్నీ అస్తవ్యస్తమయ్యాయని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని, తరుగు పేరిట చేస్తున్న కటింగ్‌లను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. రైతులను ఆదుకోవాల్సిన కనీస బాధ్యత స్థానిక మంత్రి, కలెక్టర్‌పై ఉందని బిఆర్ఎస్ పక్షాన ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక బిఆర్ఎస్ నాయకులు,రైతులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ



**ప్రజాపక్షం/మల్లాపూర్:** కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని తేమశాతం పరిశీలించిన వెంటనే తూకం వేసి మిల్లులకు తరలించి కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తూ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. ఈ మేరకు గురువారం మొగిలిపేట గ్రామంలోని ఏఆర్ఎస్ రైస్మిల్,రాఘవపేటలోని పూజ ఇండస్ట్రీస్ రైస్ మిల్, ముత్యంపేటలోని విష్ణు రైస్ మిల్లును పరిశీలించారు. అకాల వర్షాలు ఉన్నందున కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, గన్ని సంచులు, టార్పలిన్ కవర్లు అందుబాటులో ఉంచుకోవాలని,కొనుగోలుకి చేసిన ధాన్యాన్ని వెనువెంటనే మిల్లులకు తరలించి ఆన్‌లైన్‌లో నమోదు చేసి రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యేలా చూడాలని ఆదేశించారు. రైస్ మిల్లర్లు హమాలీలను అందుబాటులో ఉంచుకొని ధాన్యాన్ని వెంటనే దింపుకోవాలని, అధికారులు రైస్ మిల్లర్లు, ట్రాన్స్పోర్టేషన్ నిర్వాహకులతో సమన్వయం చేసుకొని కేంద్రాల నుండి ధాన్యాన్ని తరలించేలా నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు.ఈయన వెంట ఆర్డిఓ నరసింహారావు సివిల్ సప్లై డిఎం జితేంద్ర ప్రసాద్ తాసిల్దార్ రామచందర్ సంబంధిత అధికారులు ఉన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల గొప్పతనం చాటుతున్న 'బడిబాట'




**ప్రజాపక్షం /పెగడపల్లి :** మండల పరిధిలోని ఐతుపల్లి గ్రామ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ సార్ బడిబాట కార్యక్రమాన్ని గురువారం గ్రామ కేంద్రంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. బడిబాట మన అందరి బాధ్యత అనే నినాదంతో పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థులు, ప్రజాప్రతినిధులు మరియు గ్రామ ప్రజలు కలిసి ఉమ్మడిగా అవగాహన ర్యాలీ చేపట్టారు.గ్రామ చౌరస్తాలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ మేకల అంజమ్మ మల్లయ్య, ఉప సర్పంచ్ గోలి సంజీవరెడ్డి, జెడ్పీ హెచ్ ఎస్ హెచ్ఎం చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీపీ ఎస్ హెచ్ ఎం సురేందర్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని బడిబాట ఫ్లెక్సీని, కరపత్రాలను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదేళ్లు నిండిన ప్రతి బిడ్డను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించి, ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత నాణ్యమైన విద్యను సద్వినియోగం చేసుకోవాలని తల్లిదండ్రులను కోరారు. సర్కారు బడుల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో పాటు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు, డిజిటల్ తరగతులు పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్లు వివరించారు. ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు.అనంతరం గ్రామంలోని వీధుల గుండా ప్రదర్శన నిర్వహిస్తూ, ఇంటింటికీ తిరిగి తల్లిదండ్రులకు విద్యా పథకాలపై అవగాహన కల్పించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పోతారం ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా 'బడిబాట'




**ప్రజాపక్షం/ముత్తారం :** ముత్తారం మండలంలోని పోతారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రొఫెసర్ జయశంకర్ 'బడిబాట' కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి. సత్తయ్య ఆధ్వర్యంలో గ్రామంలో అవగాహన ర్యాలీ చేపట్టారు.ఈ సందర్భంగా ప్రతి తల్లిదండ్రీ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ బడీడు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ఎన్‌రోల్‌మెంట్ (నమోదు) పెంచాలని కోరారు. సర్కారు బడుల్లో ప్రభుత్వం కల్పించే ఉదయం అల్పాహారం, నాణ్యమైన మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు, స్టూడెంట్ కిట్ వంటి వసతులను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న గ్రామ సర్పంచ్ ఊట్ల చరణ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు.ఎఐపిసి చైర్మన్ పద్మ, పాఠశాల ఉపాధ్యాయురాలు వి. వీణ,విద్యార్థుల తల్లిదండ్రులు,విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రోడ్డుప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

**ప్రజాపక్షం/ధర్మపురి :** జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం రాయపట్నం గ్రామం వద్ద ఆగి ఉన్న ట్రాక్టర్ ను కారు వేగంగా వచ్చి ఢీకొనడంతో తరాల్ల రాయమల్లు అనే వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు.ధర్మపురి ఎస్సై జి.మహేష్ కథనం ప్రకారం.. ఎండపెల్లి మండలం కొత్తపేట గ్రామానికి చెందిన కోడి రాయమల్లు, కోడి ప్రవీణ్, గోపాల మొగిలి,గోపాల రాజయ్య,తరాల్ల ప్రవీణ్ లు షిఫ్ట్ డిజైర్ కారులో మంచిర్యాల జిల్లా హాజిపూర్ గ్రామంలో వివాహ వేడుకకు వెళ్తుండగా కార్ డ్రైవింగ్ చేస్తున్న ప్రవీణ్ నియంత్రణ కోల్పోయి మార్గమధ్యంలో ని రాయపట్నం శివారు హనుమాన్ విగ్రహం సమీపంలో నిలిపి వుంచిన ట్రాక్టర్ ను అతివేగంగా ఢీకొట్టాడు.అనంతరం పక్కనే ఉన్న యాక్టివా స్కూటీ,హోండా షైన్ బైక్ లను సైతం ఢీకొట్టాడు.దీంతో కారు ముందు సీటులో కూచున్న రాయమల్లు తలకు,ఇతర శరీర భాగాలకు తీవ్ర రక్తగాయాలై అక్కడికక్కడే మృతిచెందగా, కారులోని ఇతరులు గాయపడ్డారు. మృతదేహాన్ని,క్షతగాత్రులను108 అంబులెన్స్ ద్వారా జగిత్యాల ఆసుపత్రికి తరలించారు.కోడి ప్రవీణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేష్ తెలిపారు.

## ఎంపి దీక్షకు బిజెపి శ్రేణులు తరలి రావాలి



**ప్రజాపక్షం /మల్లాపూర్ :** ఈనెల 18వ తారీకు సోమవారం రోజున జగిత్యాల జిల్లా కేంద్రంలో నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడు ధర్మపురి అరవింద్ చేపట్టిన దీక్షకు మండల వ్యాప్తంగా బిజెపి కార్యకర్తలు,శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలని పార్టీ మండల అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా గురువారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ ఎంపీ చేపట్టి దీక్షకు పెద్ద ఎత్తున కార్యకర్తల వచ్చి మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు ఎర్ర లక్ష్మి , వేంపల్లి గ్రామ సర్పంచ్ గుగ్లవత్ రాజేందర్, పార్టీ మండల ఉపాధ్యక్షుడు లవంగ శివ,నియోజకవర్గ నాయకులు నిశాంత్ కార్తికేయ, నాయకులు రాజశేఖర్,గజ్జి శ్రీను, ఎర్ర రాజు ఇల్లెందుల మనోజ్,గడ్డం నర్సారెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీకి గ్రామ శాఖ అధ్యక్షుడు రాజీనామా

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని అబ్బాపూర్ గ్రామ కాంగ్రెస్ శాఖ అధ్యక్షుడు జక్కుల ధనంజయ్ పార్టీలో విలువలు లేకపోవడంతో వివక్షకు గురై గురువారం కాంగ్రెస్ పార్టీకి ,గ్రామ శాఖ అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పనితీరు రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా వడ్ల కొనుగోలు ఐకేపీ సెంటర్లలో సక్రమంగా కొనుగోళ్ళు జరగకపోవడంతో రైతులు నష్టపోతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు రైతులకు పూర్తి భరోసా ఉండేదని పేర్కొన్నారు. అందువల్ల ఇకపై మాజీ మంత్రి ఈశ్వర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరి ప్రజల కోసం పని చేస్తానని అన్నారు.

## ఇంటర్ ప్రథమ సంవత్సరం ఉచిత ప్రవేశాల నోటిఫికేషన్ విడుదల

**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని దర్యాపూర్ మోడల్ స్కూల్‌లో 2026,27 విద్యా సంవత్సరానికి ఇంటర్ మొదటి సంవత్సరం ఉచిత ప్రవేశాల నోటిఫికేషన్ విడుదలైంది.గ్రూపులు: ఎంపిసి, బైపిసి,సిఇసి, ఎసిఇ(ఇంగ్లీష్ మీడియం) ఫీజు ఉచితం (ఆన్‌లైన్ దరఖాస్తు మాత్రమే)వెబ్‌సైట్: టిజిఎమ్ఎస్ అడ్మిషన్ పోర్టల్ కళాశాలలో పత్రాలు ఇవ్వనవసరం లేదనిబాలికలకు ఉచిత హాస్టల్ సౌకర్యం ఉంది.మంథని,ఓడేడు, గోదావరిఖని నుండి బస్సు సౌకర్యం ఉందని ప్రిన్సిపాల్ తెలిపారు.ప్రారంభ తేదీ: 13.05.2026చివరి తేదీ: 25.05.2026మొదటి లిస్ట్ విడుదల: 26.05.2026 మరిన్ని వివరాల కోసం ఫోన్ నంబర్: 96402 34058 కోటేశ్వర్, కంప్యూటర్ ఆపరేటర్ సంప్రదించాలన్నారు.

## కొమరవెల్లి ఐకెపి సెంటర్‌ను పరిశీలన

ప్రజాపక్షం/రెబ్బెన : ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలం కొమురవెల్లి ఐకెపి సెంటర్‌ను పరిశీలించిన డిఎస్పి అశోక్.ఈ సందర్భంగా డి.ఎస్.పి అశోక్ మాట్లాడుతూ రైతులు ఎండకు తగిన జాగ్రత్తలు తీసుకుంటూ ధాన్యాన్ని వీలైనంత ఎండ బెడుతూ మైచర్ వచ్చే విధంగా చూసుకోవాలని రైతులను కోరారు.అధిక ఎండల కారణంగా రైతులు ఎప్పటికప్పుడు తగినంత నీరు తీసుకుంటూ నీడ పట్టున ఉండాలని తెలిపారు.ఐకెపి సెంటర్ అధికారులు కూడా రైతులకు అందుబాటులో ఉంటూ ధాన్యం తడవకుండా ఉండేందుకు తార్పాలిన్ కవర్స్ అందుబాటులో ఉంచాలని అలాగే రైతులకు మైచర్ వచ్చిన వెంటనే గని బ్యాగ్స్ రైతులకి అందించి ధాన్యాన్ని కాంట చేసేలా చూడాలని అధికారులకు సూచించారు. డి.ఎస్.పి అశోక్‌తో పాటు, రెబ్బెన సిఐ సంజయ్, ఎస్సై వెంకటకృష్ణ పాల్గొన్నారు. ఐకెపి సెంటర్ అధికారులు కూడా ఎప్పటికప్పుడు మై చర్ చెక్ చేస్తూ ,రైతులకు అందుబాటులో ఉండాలని అధికారులకు తెలిపారు.

## కుక్కల దాడిలో చుక్కల దుప్పి మృతి

ప్రజాపక్షం/పెంచికల్‌పేట్ : మండలంలోని ఎల్లూరు గ్రామ శివారు ప్రాంతంలో ఓ మగ చుక్కల దుప్పిపై వీధి కుక్కలు దాడి చేసిన ఘటన కలకలం రేపింది. కుక్కల నుంచి తప్పించుకునేందుకు దుప్పి పొలాల మీదుగా పరుగులు తీస్తూ గ్రామ పరిసరాలకు చేరుకుంది. గ్రామస్తులు వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అటవీ శాఖ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని దుప్పిని రక్షించేందుకు చర్యలు చేపట్టారు. డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ అస్మా, బీట్ ఆఫీసర్లు సతీష్, మహేష్, విజయలక్ష్మి, డ్రైవర్ వాజిద్‌లు గ్రామస్తుల సహకారంతో వలల సాయంతో దాదాపు రెండు గంటల పాటు శ్రమించి ఎల్కపల్లి గ్రామం వద్ద దుప్పిని పట్టుకున్నారు. గాయపడిన దుప్పికి చికిత్స అందించేందుకు పెంచికల్‌పేట్ వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్‌కు సమాచారం ఇచ్చి వైద్యం అందిస్తున్న సమయంలో దుప్పి మృతి చెందింది.అనంతరం అటవీ శాఖ అధికారులు మృత దుప్పికి పంచనామా నిర్వహించి, ఎన్‌టీసీఏ మార్గదర్శకాల ప్రకారం అటవీ ప్రాంతంలో దహనం చేసినట్లు తెలిపారు.

## నిరుపేదలకు అన్నదానం

ప్రజాపక్షం/లోకేశ్వరం : లోకేశ్వరం మండల కేంద్రానికి చెందిన కీ:శే: మోదం ఇంద్రాబాయి రెండవ వర్ధంతి సందర్భంగా వారి కుమారుడు మోదం వెలుగు సాయన్న ఆర్థిక సహాయంతో ఫుడ్ బ్యాంక్ భైంసా ఆధ్వర్యంలో వ్యవస్థాపకులు య ం.అంజనేయులు, వానల్‌పాడ్ ఇటుక బట్టీలలోని నిరుపేద కార్మికులకు మరియు భైంసా చుట్టపక్కల అక్కడక్కడ గుడిసెలు వేసుకొని నివసిస్తున్న యాచకులకు దాదాపు 80 మందికి అన్నదానం చేయడం జరిగింది. తన తల్లి వర్ధంతి సందర్భంగా సహాయం చేసి నిరుపేదల ఆకలి తీర్చిన వెలుగు సాయన్నకు మా అమ్మా, నాన్న ఫౌండేషన్ చైర్మెన్ యం. ఆంజనేయులు ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు.

# ప్రభుత్వ బడుల బలోపేతానికే 'బడిబాట'



ప్రజాపక్షం/కాగజ్‌నగర్ : ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో నమ్మకం పెంచి విద్యార్థుల చేరికలు పెంచడమే 'ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట' కార్యక్రమ లక్ష్యమని మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్ తెలిపారు. కాగజ్ నగర్ మండలం జీడీచేనులో గురువారం నిర్వహించిన ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా విద్యా వారోత్సవాలు – ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.శివకేశవ ఆలయం నుంచి ప్రభుత్వ పాఠశాల వరకు ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు అవగాహన ర్యాలీ నిర్వహించి ప్రభుత్వ బడుల్లో అందిస్తున్న నాణ్యమైన విద్య, మౌలిక వసతులు, ఉచిత సదుపాయాలపై గ్రామస్థులకు వివరించారు.విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు.ఈ సందర్భంగా వాసాల ప్రభాకర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు అన్ని వసతులు అందుబాటులో ఉన్నాయని, ప్రతి చిన్నారి విద్యను అభ్యసించేలా గ్రామస్తులు సహకరించాలని అన్నారు. కార్యక్రమంలో భాగంగా 12 మంది విద్యార్థులు ఎంపిపిఎస్ జీడీచేను పాఠశాలలో అడ్మిషన్లు పొందారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాజేందర్ నాయక్ ,స్కూల్ కాంప్లెక్స్ హెడ్ మాస్టర్ అనురాధ, ఉప సర్పంచ్ కర్ల లావణ్, ప్రధానోపాధ్యాయులు పుల్లూరి బాలకృష్ణ, ఉపాధ్యాయులు లావణ్య, అక్షిత, భవాని, వార్డ్ సభ్యులు శ్వేత, శ్రీకాంత్, రామయ్య, గంగన్న, రాజేష్, సరిత, కళావతి, మమత, సుజాత, అంజమ్మ, గ్రామ ప్రజలు,విద్యార్థులు పాల్గొన్నారు.

## అసభ్యకర, కించపరిచే పోస్టులు పెడితే కఠిన చర్యలు

### జిల్లా ఎస్పీ నితిక పంత

ప్రజాపక్షం/ఆసిఫాబాద్ : సోషల్ మీడియా వేదికలైన వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్,యూట్యూబ్, ఎక్స్ తదితర మాధ్యమాలలో వ్యక్తిగతంగా గాని, కుట్రపూరితంగా గాని ఉద్దేశపూర్వకంగా వ్యక్తులను,వర్గాలను లేదా సమాజాన్ని కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేయడం,అవమానకరమైన పోస్టులు, ఫోటోలు, వీడియోలు షేర్ చేయడం, స్టేటస్‌లలో పెట్టడం వంటి చర్యలు చట్టరీత్యా నేరమని జిల్లా ఎస్పీ నితిక పంత్ ఐపీఎస్ తెలిపారు.కొంతమంది వ్యక్తులు సామాజిక మాధ్యమాలను దుర్వినియోగం చేస్తూ ఇతరుల మనోభావాలను దెబ్బతీసేలా, సమాజంలో విద్వేషాలు రెచ్చగొట్టేలా పోస్టులు పెడుతున్నారని, ఇటువంటి చర్యల వల్ల శాంతి భద్రతలకు భంగం కలిగే అవకాశం ఉందని ఎస్పీ పేర్కొన్నారు.ముఖ్యంగా తప్పుడు ప్రచారాలు,అసత్య వార్తలు, మార్ఫింగ్ చేసిన ఫోటోలు, అసభ్యకర వీడియోలు, వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతీసే కంటెంట్‌ను సోషల్ మీడియాలో ప్రచారం చేయడం తీవ్ర నేరంగా పరిగణించబడుతుందని తెలిపారు.సైబర్ నేరాలకు సంబంధించిన చట్టాల ప్రకారం నిందితులపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోషల్ మీడియాలో ఏదైనా పోస్టు చేయడానికి ముందు అది ఇతరులకు ఇబ్బంది కలిగిస్తుందా లేదా చట్ట విరుద్ధమా అనే విషయాన్ని తప్పనిసరిగా ఆలోచించాలని సూచించారు.ప్రజలు అప్రమత్తంగా ఉండి, ఎలాంటి అసభ్యకర లేదా విద్వేషపూరిత పోస్టులు గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్ సమాచారం అందించాలని ఎస్పీ కోరారు. సోషల్ మీడియాను సమాజ హితం కోసం బాధ్యతాయుతంగా వినియోగించాలని సూచించారు.

## సింగరేణి మందమర్రి ఏరియాలో మల్టీ డిపార్ట్‌మెంటల్ మీటింగ్



ప్రజాపక్షం/మందమర్రి : సింగరేణి మందమర్రి ఏరియాలో ఈ నెల 18వ తేదీ నుంచి నిర్వహించనున్న మల్టీ డిపార్ట్‌మెంటల్ మీటింగ్‌ల విజయవంత నిర్వహణపై ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం ప్రెస్‌మీట్‌తో పాటు యూనియన్ నాయకులతో ప్రత్యేకంగా సమావేశమై పలు కీలక అంశాలపై చర్చించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో మందమర్రి ఏరియాలో వివిధ విభాగాల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయడంతో పాటు అభివృద్ధి పనులను వేగవంతం చేయడమే మల్టీ డిపార్ట్‌మెంటల్ మీటింగ్ ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. ఏరియాలోని అన్ని గనులు, విభాగాల్లో ఈ సమావేశాలు నిర్వహించబడతాయని వెల్లడించారు.సంస్థలో నాణ్యత, ఉత్పత్తి, ఉత్పాదకత పెంపు దిశగా సమగ్ర కార్యాచరణ రూపొందించనున్నామని పేర్కొన్నారు.శాఖల మధ్య సమన్వయం పెరిగితే సంస్థ మరింత పురోగతి సాధిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.ఈ క్రమంలో ఏఐటీయూసీ యూనియన్ ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి కార్మికుల సమస్యలు, సంక్షేమం, సంస్థాభివృద్ధిపై విస్తృతంగా చర్చించినట్లు తెలిపారు. కార్మికుల సహకారంతో సంస్థను మరింత బలోపేతం చేసే దిశగా చర్యలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్ ఓ టు జీఎం జీవీల్ ప్రసాద్, ఏఐటీయూసీ మందమర్రి బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ,బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్, కేకే గ్రూప్ ఏజెంట్ రాంబాబు, ఎస్‌కే గ్రూప్ ఏజెంట్ ఖాదీర్, ఏరియా ఇంజనీర్ ఈ అండ్ ఎం బాలాజీ భగవతి, డీజీఎం పర్సనల్ అశోక్, డీజీఎం ఐడి కిరణ్ కుమార్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ సత్యనారాయణ,అన్ని గనుల మేనేజర్లు, సంక్షేమ అధికారులు,ఉత్తమ ఉద్యోగులు,తదితరులు పాల్గొన్నారు.

## సమ్మర్ క్యాంపుల ద్వారా విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధి

### డీఈఓ యాదయ్య



ప్రజాపక్షం /జన్నారం : ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక విద్యా వారోత్సవాల్లో భాగంగా గురువారం రోజున జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య పీఎం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, జన్నారంను సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపును పరిశీలించి విద్యార్థుల ప్రతిభను అభినందించారు. సమ్మర్ క్యాంపుల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని ఆయన సూచించారు. ఇంట్లో ఉండడం కంటే 6 నుంచి 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు సమ్మర్ క్యాంపులకు హాజరవడం ద్వారా ఏదో ఒక నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.తల్లిదండ్రులు పిల్లలను ఉదయం 8 గంటలకు క్యాంపులకు పంపించాలని కోరారు. అలాగే ప్రతి ఉపాధ్యాయుడు కనీసం ఐదుగురు విద్యార్థులను సమ్మర్ క్యాంపులో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. 2026–27 విద్యా సంవత్సరంలో విద్యార్థుల నమోదు సంఖ్యను మరింత పెంచాలని పాఠశాల సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన స్టోరీ టెల్లింగ్, నృత్యం, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, డ్రాయింగ్, స్టిచింగ్, టైలరింగ్ ప్రదర్శనలను తిలకించి మెచ్చుకున్నారు. అత్యుత్తమ ప్రదర్శనలు చేసిన విద్యార్థులకు పెన్నులు బహుమతిగా అందజేశారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గోల్ల రామన్న, మండల విద్యాధికారి ఎన్. విజయకుమార్, నాయకులు మోహన్ రెడ్డి,తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విద్యా సంస్థల మధ్య కీలక ఒప్పందం

ప్రజాపక్షం/ మావల: జిల్లాలో విద్యా ప్రమాణాలు మెరుగుపరచడమే లక్ష్యంగా కలెక్టర్ రాజర్షి షా చొరవతో ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల, రిమ్స్ నర్సింగ్ కళాశాల మధ్య కీలక విద్యా ఒప్పందం కుదిరింది. గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ అనిత, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సంగీత ఈ ఒప్పంద పత్రాలను కలెక్టర్‌కు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బి.ఎస్.సి హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్ విద్యార్థులకు ఆచరణాత్మక అవగాహన కల్పించేందుకే ఆ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. రిమ్స్ నర్సింగ్ కళాశాలలోని అత్యాధునిక వనరులు, నిపుణులైన అధ్యాపకుల పర్యవేక్షణలో శిక్షణ పొందడం వల్ల విద్యార్థులకు వైద్య రంగంపై పూర్తి స్థాయి పట్టు లభిస్తుందని పేర్కొన్నారు. ఈ సహకారం వల్ల విద్యార్థుల్లో వృత్తిపరమైన నైపుణ్యాలు పెరిగి, భవిష్యత్తులో హెల్త్‌కేర్ రంగంలో మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

## ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య

ప్రజాపక్షం/నేరడిగొండ: మండలంలోని తేజాపూర్‌లో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జ్ బద్ధం పోశారెడ్డి, ప్రధానోపాధ్యాయులు మణిలత, సంతోష్ కుమార్ పాల్గొన్నారు. బడీడు పిల్లలను బడిలో చేర్పించి ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే నేరడిగొండ జూనియర్ కళాశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సదస్సు నిర్వహించారు. ప్రభుత్వ విద్యతో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని విద్యార్థులకు అవగాహన కల్పించారు. హెల్త్ సూపర్వైజర్ సంతోష్ కుమార్ వడదెబ్బపై జాగ్రత్తలు సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ముడుపు ప్రభాకర్ రెడ్డి

ప్రజాపక్షం/ఆదిలాబాద్ రూరల్: భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గజంగుల రాజు కుమార్తె నవ్యశ్రీ చరణ్‌ల వివాహం గురువారం పట్టణంలోని ఆర్‌ఎస్ గార్డెన్‌లో జరిగింది. ఈ వేడుకకు సిపిఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అలాగే పద్మనాయక్ గార్డెన్‌లో జరిగిన పవర్ గోవిందరావు కుమారుడు, సివిల్ సబ్ ఇన్‌స్పెక్టర్ గౌతమ్, హరిప్రియల వివాహానికి కూడా ఆయన హాజరయ్యారు. పెళ్లి కుమారుడు, పెళ్లి కుమార్తెలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ అక్షింతలు వేసి దీవించారు. పలువురు నాయకులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత

ప్రజాపక్షం/పెంచికలపేట్ : మండలంలోని చేడ్వాయి గ్రామ పరిసర ప్రాంతంలో రాత్రి సమయంలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఒక ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకుని సీజ్ చేశారు. ఈ ఘటనపై సంబంధిత వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. అక్రమంగా ఇసుక రవాణా జరుగుతున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు తనిఖీలు నిర్వహించి ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకున్నారు.అనంతరం వాహనాన్ని సీజ్ చేసి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై అనిల్ కుమార్ మాట్లాడుతూ, ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేయడం చట్ట విరుద్ధమని తెలిపారు. ఎవరైనా అక్రమంగా ఇసుక తరలింపు నిర్వహిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు.

## సింగరాయపేటలో టిబి ముక్తి భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహణ

ప్రజాపక్షం/జన్నారం : జన్నారం మండలం సింగరాయపేట గ్రామంలో డిప్యూటీ డీఎం హెచ్ వో డాక్టర్ సుధాకర్ నాయక్ ఆదేశాల మేరకు టిబి ముక్తి భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు టిబి వ్యాధిపై అవగాహన కల్పించారు. టీ బి వ్యాధి బారిన పడకుండా ఉండాలంటే ధూమపానం,మద్యపానం వంటి చెడు వ్యసనాలను మానాలని వైద్య సిబ్బంది సూచించారు.టిబి లక్షణాలు, వ్యాధి నిర్ధారణ,చికిత్స విధానాల గురించి ప్రజలకు వివరించారు. అలాగే అనుమానితులకు ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తొడసం రజిత రామ్ పాల్, ఉప సర్పంచ్ బట్టు వరలక్ష్మి,ఎంఎల్‌హెచ్‌పి నవనీల,హెల్త్ అసిస్టెంట్లు కొల్లూరి కమలాకర్,ఎండీ రషీద్, పద్మ,ఎక్స్‌రే టెక్నీషియన్ రాజేష్, లింక్ వర్కర్ సుధారాణి,ఆశా కార్యకర్తలు తిరుమల,సుజాత,సుమలత,గ్రామ ప్రజలుపాల్గొన్నారు.

# రైతు సమస్యలపై సమరభేరి

## ఆర్.డి.ఓ. కార్యాలయం వద్ద ఎం.ఎల్.ఎ. మహేశ్వర్ రెడ్డి ధర్నా



**ప్రజాపక్షం/నిర్మల్ :** రైతాంగ సమస్యల పరిష్కారం కోరుతూ భారతీయ జనతా పార్టీ శాసనసభాపక్ష, బిజేఎల్‌పి. నాయకులు, నిర్మల్ ఎం.ఎల్.ఎ. ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం నిర్మల్ ఆర్.డి.ఓ. కార్యాలయం ఎదుట భారీ ధర్నా కార్యక్రమం ప్రారంభమైంది. ఆర్డీ, కార్యాలయానికి చేరుకున్న ఎం.ఎల్.ఏ. ముందుగా ప్రకటించిన కార్యాచరణ ప్రకారం, ఎం.ఎల్.ఏ. మహేశ్వర్‌రెడ్డి, కార్యకర్తలు రైతులతో కలిసి భారీ ర్యాలీగా తరలివచ్చి ఆర్డీ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. ప్రభుత్వం రైతుల పట్ల అనుసరిస్తున్న తీరును నిరసిస్తూ ఆయన ఈ ధర్నాకు దిగారు వరి కొనుగోళ్ళు, మద్దతు ధర, రైతు భరోసా వంటి పెండింగ్‌లో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

**ఉద్రిక్తల మధ్య నిరసన**

ఎం.ఎల్. ఏ. రాకతో ఆర్డీ కార్యాలయ ప్రాంగణం బిజె పి శ్రేణులు రైతులతో కిక్కిరిసిపోయింది. రైతు వ్యతిరేక విధానాలు నశించాలి అంటూ నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా ఎం.ఎల్.ఏ. మాట్లాడుతూ రై తులు పండించిన పంటను కొనుగోలు చేయడంలో ప్ర భుత్వం వైఫల్యం చెందిందని, రైతులకు న్యాయం జరి గే వరకు తమ పోరాటం ఆగదని హెచ్చరించారు. శాం తిభద్రతల దృష్ట్యా పోలీసులు భారీగా మోహరించారు. నిరసన కొనసాగుతుండటంతో ఆర్డీ కార్యాలయం వద్ద ఉత్కంఠ వాతావరణం నెలకొంది. ధర్నాలో జిల్లా బిజెపి నాయకులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో జాప్యం చేయవద్దు

## జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా





**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో ఆలస్యం చేయవద్దని జిల్లా కలెక్టర్ భవేశ్‌మిశ్రా అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ మండలాల వారిగా అనుమతులు లభించిన ఇండ్లు, ప్రారంభించిన నిర్మాణాలు, అటవీ నిబంధనల వల్ల ఆగిన ఇండ్లు, తదితర అంశాలు సమీక్షించారు. తమ పరిధిలో ఉన్న అటవీ అంశాల సమీక్షించారు. తమ పరిధిలో ఉన్న అటవీ అంశాల పరిష్కారానికి అటవీ అధికారులు కృషి చేయాలన్నారు. ఇండ్ల నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎంపిడివో లు ఇండ్ల నిర్మాణాలకు సంబంధించి దరఖాస్తులు పరిశీలించి, అర్హత ఉన్న దరఖాస్తులను పై దశకు పంపించాలని అన్నారు. ఏదైనా సాంకేతిక సమస్యలు ఎదురవుతే వేంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అధికారులు క్షేత్రస్థాయిలో వెళ్ళి లబ్దిదారులతో మాట్లాడి, ఇండ్ల నిర్మాణాలు వెంట వెంటనే పూర్తి చేసేలా వారిని ప్రోత్సహించాలని తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.వెంకటేశ్వర్లు, ఖానాపూర్ ఫారెస్ట్ డివిజనల్ అధికారి రేవంత్ చంద్ర, హౌజింగ్, ఫారెస్ట్ అధికారులు, ఎంపిడిఓలు, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగ అభివృద్ధికి కృషి

## ఎం.ఎల్.ఎ. ఏలేటి మహేశ్వర్ రెడ్డి



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** నియోజకవర్గంలో విద్యారంగ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని బిజెపి నేత ఎం.ఎల్.ఏ. ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా నిర్మల్ రూరల్ మండలం అనంతపేట్ గ్రామంలోని కేజీబీవీ పాఠశాలలో రూ. 54.50 లక్షలతో పాఠశాలలో అదనపు గదుల నిర్మాణానికి, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలని అన్ని రంగాల్లో రాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎం.ఎల్.ఏ. నల్ల ఇంద్రకరణ్ రెడ్డి, మండల అధ్యక్షులు వెంకట్ రెడ్డి, మండల నాయకులు జమాల్, గ్రామ సర్పంచ్ సునీత రాజేశ్వర్, డి.ఇ.ఓ. భోజన్న, డి.ఇ. గంగాధర్, ఎ.ఇ. ఆంజనేయులు, నాయకులు లవ గౌడ్, బిజేపి నాయకులు , కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అదృశ్యమైన మహిళ అడవిలో మృతి



**ప్రజాపక్షం/ఖానాపూర్ :** కనబడకుండా మహిళ ఇంటికి వస్తదనుకుంటే శవమై కనిపించిందని కుటుంబ సభ్యుల కన్నీరు, ఖానాపూర్ పట్టణానికి చెందిన బొమ్మన మౌనిక 30 మృతదేహం గురువారం ఖానాపూర్ మండలంలోని తర్లపాడ్ గ్రామ సమీప అటవీ ప్రాంతంలో లభ్యమవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరు మున్నీరయ్యారు. ఖానాపూర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఖానాపూర్ పట్టణం శాంతినగర్ కాలనీకి చెందిన బొమ్మెన మౌనికకు మామడ మండలం లింగంపల్లి గ్రామానికి చెందిన నల్ల అరుణ్‌తో రెండేళ్ళ క్రితం వివాహం జరిగింది. ప్రస్తుతం ఆమె అత్తగారి ఇంట్లో నివసిస్తోంది. కాగా ఐదు రోజుల క్రితం మౌనిక అత్తగారి ఇంటి నుండి బయటకు వెళ్ళి తిరిగి రాలేదు. అత్తింటి కుటుంబ సభ్యులు మామడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అప్పటి నుంచి పోలీసులు, కుటుంబ సభ్యులు ఆమె కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో గురువారం ఖానాపూర్ మండలం తర్లపాడ్ గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో మౌనిక మృతదేహం గుర్తించారు. ఈ సమాచారం అదృశ్యమైన మౌనిక కుటుంబ సభ్యులకు తెలుపగా వారు వచ్చి రూసి అది మౌనిక మృదేహంగా గుర్తించిన కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. అయితే మౌనిక మృతికి వారి అత్తింటి వారే కారణమని మృతురాలి తల్లి ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సిఐ అజయ్ కుమార్ తెలిపారు.

# అకాల వర్షంతో అన్నదాత అవస్థ



**ప్రజాపక్షం / ఖానాపూర్ :** ఆరుగాలం పండించిన పంట చేతికి అందే సమయంలో అకాల వర్షాలతో రైతన్న కుదేలు, ఒకవైపు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు ఆలస్యం, మరోవైపు అకాల వర్షాలతో కల్లాలో నిల్వ ఉంచిన ధాన్యం తడిసిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఖానాపూర్ మండలంలో బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షం ఈదురుగాలలతో రైతులకు తీవ్ర నష్టం జరిగింది, పట్టణంలోని మార్కెట్ యార్డ్‌లో కొనుగోలు కేంద్రాల వద్ద నిల్వ ఉంచిన వరి ధాన్యం మొక్కజొన్న పంటలు పూర్తి తడిసిపోయాయి రాత్రి ఒక్కసారిగా అకస్మాత్తుగా వర్షం కువడంతో వడ్లని రక్షించేందుకు సరైన ఏర్పాట్లు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు మండలంలోని పలు గ్రామాల్లో ఈదురుగాలుల ప్రభావంతో పొలాల్లో ఉన్న వరి పంట నేల కొరిగింది. ఇప్పటికే సాగు ఖర్చులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు ఈ అకాల వర్షం మరింత భారంగా మారింది. కోత దశలో ఉన్న పంట దెబ్బతినడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్ యార్డ్‌లో తడిసినోయిన ధాన్యాన్ని ఎలాంటి షరతులు లేకుండా వెంటనే కొనుగోలు చేయాలని రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. తడిసిన ధన్యాన్ని తిరస్కరిస్తే భారీ నష్ట వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం తక్షణమే పరిహారం ప్రకటించాలని కోరుతున్నారు. అకాల వర్షాల కారణంగా రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతుండగా, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేసి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

# సమ్మర్ క్యాంపులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

## - డీఈఓ ఎస్. యాదయ్య

**ప్రజాపక్షం/జన్నారం :** పాఠశాలల్లో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపుల ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.యాదయ్య సూచించారు.గురువారం మంచిర్యాల జిల్లా జన్నారం మండల కేంద్రంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపు ను ఆయన సందర్శించారు.ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ సమ్మర్ క్యాంపు ల ద్వారా విద్యార్థుల్లో స్కిల్ డెవలప్మెంట్ పెంపొందుతుందని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు సృజనాత్మకత,నాయకత్వ లక్షణాలు, వ్యక్తిత్వ వికాసం వంటి అంశాల్లో అభివృద్ధి చెందేందుకు ఈ క్యాంపులు దోహదపడతాయని అన్నారు.అనంతరం మండలంలోని కలమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించిన ఆయన, ఎఫ్ఆర్సీ ఆధ్వర్యంలో ఉత్తమ హాజరు శాతం నమోదు చేసిన పాఠశాల హెచ్ఎం కట్ట రాజమౌళికి ప్రశంసా పత్రాన్ని అందజేసి అభినందించారు. అలాగే పదో తరగతిలో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఎం ఈ ఓ విజయకుమార్, పాఠశాల హెచ్ఎంలు గోళ్ల రామన్న, కట్ట రాజమౌళి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గుర్రం మోహన్ రెడ్డి,కలమడుగు సర్పంచి బొంతల నాగమణిమల్లేష్,తదితరులు పాల్గొన్నారు.

# పోక్సో కేసులో నిందితుడి అరెస్ట్

**ప్రజాపక్షం/కుంటాల :** నిర్మల్ జిల్లా కుటాల మండలంలోని అందకూర్ గ్రామంలో ఓ బాలకపై లైంగిక దాడికి యత్నించిన శ్రీధర్ 25 అనే నిందునిపై ఫోక్సో కేసు నమోదయింది. కుంటాల ఎస్.ఐ. అశోక్ కథనం మేరకు బుధవారం అర్థరాత్రి సమయంలో అదే గ్రామానికి చెందిన శ్రీధర్ 25 అనే వ్యక్తి గ్రామంలో ఆరుబయట కుటుంబ సభ్యులతో కలిసి నిద్రిస్తున్న ఓ మైనర్ బాలిక వద్దకు వెళ్ళి ఆమె చేయి పట్టుకొని బలవంతం చేయడానికి ప్రయత్నించాడు. దీంతో బాలిక వెంటనే మేల్కొని గట్టిగా అరవడంతో, పక్కనే నిద్రిస్తున్న ఆమె తల్లి మేల్కొని నిందితుడిని శ్రీధర్‌గా గుర్తించింది. అనంతరం నిందితుడు అక్కడి నుండి పారిపోయాడు. మైనర్ బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కుంటాల పోలీస్ స్టేషన్‌లో పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు . కేసును త్వరితగతిన విచారించిన పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి, అనంతరం జుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. మైనర్ బాలికలపై నేరాల విషయంలో పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారని, ఇలాంటి ఘటనలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని పోలీసులు సూచించారు.

# అక్రమాలకు అడ్డాగా కుంటాల ప్యాక్స్

## చేయి తడిపితేనే గన్నీ సంచులు, తూకం



**ప్రజాపక్షం/కుంటాల :** కుంటాల మండల కేంద్రంలో గల సహకార సంఘం రైతుల పాలిట శాపంగా మారింది. రైతులకు చేయూతనందించాల్సిన సిబ్బంది కొందరు చేయి తడిపితేనే పనిచేస్తూ రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గత నెల రోజులకు పైగా సొసైటీ కొనుగోలు కేంద్రంలో ధాన్యం తూకం వేసేందుకు ఉంచగా గన్నీ బ్యాగులు ఇవ్వడం లేదని కొందరు సిబ్బంది క్రమ సంఖ్యను సైతం పాటించడం లేదని రైతులు వాపోతున్నారు. గన్నీ బ్యాగుల కొరతతో ప్రైవేటుగా కొనుగోలు చేసుకుని వస్తే తూకం చేయడం లేదని ఆరోపిస్తున్నారు. ఇదే అదునుగా కొందరు దళారులు ధాన్యం తరలించేందుకు లారీల కొరతను సృష్టించి రైతుల వద్ద అందిన కాడికి దండుకుంటున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గాలి వానలతో నిత్యం కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యం తడిసిపోకుండా రాత్రింబవళ్ళు ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి కుంటాల ప్యాక్స్ లో అక్రమాలను అరికట్టి మొక్కజొన్న, వరి ధాన్యం, జొన్నలు త్వరితగతిన గోదాములకు తరలించి రైతుల ఇబ్బందులను తొలగించాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని రైతులు హెచ్చరించారు.

# చెట్ల అక్రమ నరికివేత కేసులో నలుగురు అరెస్ట్

**ప్రజాపక్షం/జన్నారం :** జన్నారం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ లక్ష్మీ నారాయణ ఆధ్వర్యంలో చింతగూడ సెక్షన్ పరిధిలో జరిగిన అక్రమ చెట్ల నరికివేత కేసులో నలుగురు నిందితులను అటవీ శాఖ అధికారులు అరెస్ట్ చేశారు.జన్నారం రేంజ్, చింతగూడ సెక్షన్, చింతగూడ బీట్ పరిధిలో విశ్వసనీయ సమాచారం మేరకు మంగళవారం రోజున ఉదయం డాగ్ స్వాడ్ టీమ్ , సంబంధిత అటవీ సిబ్బంది సంయుక్తంగా దాడులు నిర్వహించి సట్ల రాజన్న, కొమిరే రాజం,ఆర్ పోషం, మైనేని సురేష్‌లను అదుపులోకి తీసుకున్నారు.విచారణలో నిందితులు ఇతరులతో కలిసి రాత్రి వేళల్లో అడవిలోకి ప్రవేశించి టేపవేశించి చెట్లను అక్రమంగా నరికి కలపను విక్రయించినట్లు ఒప్పుకున్నారని అధికారులు తెలిపారు.అలాగే సట్ల రాజన్న, కొమిరే రాజం పై గతంలో కూడా పలు అటవీ నేర కేసులు నమోదై ఉన్నట్లు విచారణలో వెల్లడైంది.నిందితులను గౌరవ న్యాయస్థానం ముందు హాజరుపరచగా, కోర్టు రిమాండ్ విధించింది.అటవీ సంపదను నాశనం చేసే వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని అటవీ శాఖ హెచ్చరించింది.ఈ దాడిలో డాగ్ స్వాడ్ బీట్ ఆఫీసర్ ఎల్. అనిల్ నాయక్,చింతగూడ సెక్షన్ బీట్ ఆఫీసర్లు బి. భోజ నాయక్,కృష్ణారావు,వెంకటేష్, శ్రీకాంత్,తదితరులు పాల్గొన్నారు.

## అంగవైకల్యం విజయానికి అడ్డుకాదు

ప్రజాపక్షం/భైంసా : కుబీర్ మండలం అంతర్ని గ్రామానికి చెందిన దివ్యాంగురాలు జాదవ్ భీంబాయి, అంగవైకల్యం విజయానికి అడ్డుకాదని నిరూపించింది. భైంసా పట్టణం లోని గురుకృపా వొకేషన ల్ జూనియర్ కళాశాలలో ఎం.పి. హెచ్.డబ్ల్యు. (ఫీమేల్) కోర్సు పూర్తి చేసిన భీంబాయి, కళాశాల యాజమాన్యం సహకారంతో వరంగల్‌లోని కాకతీయ విశ్వవిద్యాలయం లోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో బీ.ఎస్సీ నర్సింగ్ సీటు సాధించింది. ప్రారంభంలో దివ్యాంగురాలు కావడంతో ఆమెకు సీటు నిరాకరించినప్పటికీ భీంబాయి ఆత్మస్థైర్యం కో ల్పోకుండా అధికారులను సంప్రదించి తన హక్కును సాధించుకుంది. ఉద్యోగ నియామక పత్రాన్ని స్వీకరించే సందర్భంగా తెలంగాణ ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహాతో సెల్ఫీ తీసుకొని తన ఆనందాన్ని వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా భీంబాయిని గురుకృపా కళాశాలల డైరెక్టర్, డాక్టర్ ముస్కం రామకృష్ణాగౌడ్ , శారద ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షురాలు ముష్కం ప్రసన్న రాణి, కళాశాల ప్రిన్సిపల్ సాయినాథ్, అధ్యాపకులు అభినందించారు.

## తిమ్మాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాపక్షం/సర్పాపూర్: (జి) మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో ధాన్యం కొ నుగోలు కేంద్రాన్ని గురువారం పి. ఎ.సి.ఎస్. చైర్మెన్ సట్ల గజ్జారాం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, రైతు లు పండించిన ధాన్యానికి మద్దతు ధర ఇ స్తూ కొనుగోలు చేస్తుందని, మధ్యవర్తుల దోపిడికి అడ్డుకట్ట వేసేందుకు ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలో, రైతులు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకువచ్చి ప్రభుత్వ మద్దతు ధరను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులకు ఏలాంటి ఇబ్బందులు లేకుండా పారదర్శకంగా కొనుగో లు ప్రక్రియను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు సర్పంచ్ ఆలూరు రాజేందర్, ఇంచార్జి సత్యం తెలిపారు. ఉప సర్పంచ్ కొత్తపల్లి నరేష్, జడ్.పి. మాజీ చైర్మెన్ జుట్టు అశోక్, డిసిసిబి డైరెక్టర్ తూర్పాటి వెంకటేష్, మధుకర్, వినో ద్ గ్రామ పెద్దలు విడిసి సభ్యులు, వార్డ్ మెంబర్లు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యం

బడిబాటలో జిల్లా విద్యాశాఖాధికారి దర్శనం భోజన్న



ప్రజాపక్షం/దిలావర్‌పూర్ : నిర్మల్ జిల్లాలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంపు లక్ష్యంగా నిర్వహిస్తున్న ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట కార్యక్రమం గురువారం నాలుగవ రోజుకు చేరుకుంది. జిల్లా విద్యాశాఖ అధికారి దర్శనం భోజన్న జిల్లాలోని వివిధ మండలాల్లో పర్యటించి, బడిబాట ర్యాలీలు, మెగా తల్లిదండ్రుల సమావేశాల్లో పాల్గొన్నారు.

**దిలావర్‌పూర్ బడిబాట ర్యాలీ**

దిలావర్‌పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో డిఇఓ మన బడి మన బాధ్యత పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, మెరుగైన వసతులు ఉన్నాయని, ప్రతి చిన్నారిని ప్రభుత్వ బడిలోనే చేర్పించాలని కోరారు. అనంతరం ఉపాధ్యాయులతో కలిసి ఇంటింటి కి వెళ్ళి బడి ఈడు పిల్లల నమోదుపై అవగాహన కల్పించా రు.

**గుండంపెల్లి ఉపాధి హామీ కూలీలతో సమావేశం**

దిలావర్‌పూర్ మండలంలోని గుండంపల్లి గ్రామంలో ఉపాధి హామీ పనులు వద్దకు వెళ్ళిన డిఇఓ , అక్కడ ఉన్న కూలీలు, తల్లిదండ్రులతో మాట్లాడారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ తక్కల రమణారెడ్డి, సెక్టోరల్ అధికారి ప్రవీణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

**ముగిసిన మధ్యాహ్న భోజన వంటల పోటీలు**

నిర్మల్ అర్బన్ మండలంలోని ప్రభుత్వ ఈదిగాం పాఠశాలనందు మండల స్థాయి మధ్యాహ్న భోజన ఏజెన్సీల వంటల పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేసిన డిఇఓ మాట్లాడుతూ, విద్యార్థులకు రుచికరమైన పోషకాలతో కూడిన ఆహారం అందించడమే ప్రభుత్వ ఉద్దేశ్యమని పేర్కొన్నారు. మండల విద్యాధికారులు పద్మ సదానందం, ప్రధానోపాధ్యాయులు నీరజా రాణి, శిలారి మధుసూదన్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ కూలీలతో కలిసి అవగాహన

ప్రజాపక్షం/కడెం : నిర్మల్ జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజా అవగాహన కార్యక్రమాల్లో భాగం గా జిల్లా ఎస్.పి. డా.జి. జానకీ షర్మిల, ఐపిఎస్ గురువార ం కడెం మండలంలోని మారుమూల గ్రామమైన పెద్ద బె ల్లాల్‌లో పర్యటించారు. ఉపాధి హామీ పనుల వద్దకు స్వయంగా వెళ్ళిన ఎస్పీ అక్కడ పని చేస్తున్న సుమారు 400 మంది మహిళా కూలీలతో ముచ్చటించి, వివిధ సామాజిక అంశాలపై అవగాహన కల్పించారు.



**వికలాంగుడి సమస్యలపై తక్షణ స్పందన**

కార్యక్రమంలో భాగంగా పెద్ద బెల్లాల్ గ్రామానికి చెందిన ఓ వికలాంగుడు తన సమస్యను ఎస్పీకి విన్నవించుకోగా, ఆమె తక్షణమే స్పందించారు. అక్కడికక్కడే పోలీసు అధికారులతో మాట్లాడి, బాధితుడి సమస్యను ప్రాధాన్యత క్రమంలో వీలైనంత త్వరగా పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. గ్రామస్తులు ఎస్పీ పనితీరుపై హర్షం వ్యక్తం చేశారు

**సైబర్ నేరాలు – గంజాయిపై హెచ్చరిక**

ముఖ్యంగా ప్రతి కుటుంబంలోని పెద్దలు తమ పిల్లల నడవడికపై దృష్టి సారించాలని ఎస్పీ సూచించారు. గంజాయి వంటి మత్తు పదార్థాలు ఆరోగ్యంతో పాటు కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తాయని, గ్రామాల్లో ఎవరైనా ఇలాంటి అక్రమ విక్రయాలకు పాల్పడితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. అలాగే సైబర్ మోసాలు, మైనర్ డ్రైవింగ్ వల్ల జరిగే అనర్థాల గురించి విపులంగా వివరించారు. కూలీలతో కలిసి సెల్ఫీలు అవగాహన అనంతరం మ హిళా కూలీలతో ఎస్పీ ఎంతో ఆప్యాయంగా మాట్లాడారు. వారు తెచ్చుకున్న సద్ది అన్నం పొట్లాలను పరిశీలించి అం దులో ఏమున్నాయో అడిగి తెలుసుకున్నారు. ఎస్పీ తమ వ ద్దకు వచ్చి ఇంత సరదాగా మాట్లాడటంతో మహిళా కూలీ లు సంతోషం వ్యక్తం చేస్తూ ఆమెతో కలిసి సెల్ఫీలు దిగారు.

**జిల్లా వ్యాప్తంగా గంజా గస్తీ**

మత్తు పదార్థాల నిర్మూలనలో భాగంగా జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోని వరి కొనుగోలు కేంద్రాల వద్ద పోలీసులు గంజా గస్తీ నిర్వహించారు. హోంగార్డు నుండి ఎస్పీ వరకు ప్రతి ఒక్కరు రైతులకు యువతకు గంజాయి దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. భైంసా ఏ.ఎస్పీ సాయి కిరణ్ మాటేగాం వద్ద గల వరి గోదాములను సందర్శించి రైతులతో మాట్లాడారు. ఈ కార్యక్రమాల్లో నిర్మల్ డి.ఎస్పీ, శ్రీనివాస్, డి.ఆర్.డి.ఓ. అధికారి విజయలక్ష్మీ , ఖానాపూర్ ఇన్స్‌పెక్టర్ అజయ్, సైబర్ సెల్ ఇన్స్‌పెక్టర్ వెంకటరమణ, షీటీం బృందం మరియు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# 22న ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి సభ

నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలి

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక పై అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష



ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : ప్రజా పాలన — ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక లో భాగంగా ఈ నెల 22వ తేదీన శుక్రవారం జిల్లా స్థాయి సభ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఈ నెల 22 వ తేదీన శుక్రవారం జిల్లాస్థాయి సభ నిర్వహణపై వివిధ శాఖల జిల్లా అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ గురువారం సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా సభలో ఫ్లెక్సీ చేయాలని సూచించారు. ఆరు గ్యారంటీలు. వివిధ ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల వివరాలతో కరపత్రం రూపొందించాలని, దానిని కార్యక్రమంలో అందజేయాలని తెలిపారు. లబ్ధిదారుల అభిప్రాయాలను అందరికీ వివరించాలని పేర్కొన్నారు. మంత్రి, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, యువత, రైతులు, వివిధ పథకాల లబ్ధిదారులను ఆహ్వానించాలని ఆదేశించారు. అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. సభలు తెలంగాణ రాష్ట్ర గీతం (జయ జయహే తెలంగాణ) స్వాగతోపన్యాసం, పరిచయం అలాగే సీఎం గారి సందేశం వినిపించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక పథకాలు రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,రూ.500 కే సబ్సిడీ గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి (200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, సన్న రకం వరికి బోనస్, చేయూత పెన్షన్లు, కళ్యాణ లక్ష్మి / షాదీ ముబారక్, ఇందిరా మహిళా శక్తి బ్యాంక్ లింకేజీ, వడ్డీ లేని రుణాలు, ఇందిరమ్మ చీరలు కొత్త రేషన్ కార్డుల లబ్ధిదారుల వివరాలు, సాధించిన విజయాలపై శాఖల ద్వారా సమాచారం ఇవ్వాలని, లబ్ధిదారుల పేర్లను చదవాలని, లబ్ధిదారుల అభిప్రాయాలు, అనుభవాలు చెప్పాలని తెలిపారు. ఇప్పటి దాకా అమలు చేస్తున్న వాటిపై చర్చించాలని, భవిష్యత్తో చేపట్టనున్న పనులపై తీర్మానాలు సిద్ధం చేయాలని ఆదేశించారు.ఈ నెల 18 నుంచి పర్యాటక శాఖ, యువజన వారోత్సవాలు.. ఈ నెల 18 వ తేదీ నుంచి 23వ తేదీ వరకు పర్యాటక శాఖ, యువజన వారోత్సవాలు షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ నెల 18 వ తేదీన రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో 2 కే రన్ నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఈ నెల 21వ తేదీన షెడ్యూల్ ప్రకారం ప్లే అండ్ పార్టిసిపేట్ స్పోర్ట్స్ దే లో భాగంగా సమ్మర్ క్యాంప్ కార్యక్రమాలకు హాజరవుతున్న పిల్లలతో స్పోర్ట్స్ దే కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ నెల 22 వ తేదీన పర్యాటక, ఆధ్యాత్మిక ప్రదేశాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని, అదే రోజు జిల్లా స్థాయి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని, 23 వ తేదీన మెగా జాబ్ మేళా చేపట్టాలని తెలిపారు. మిగతా కార్యక్రమాలు ప్రభుత్వ షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్డీఓ లక్ష్మీ నారాయణ, సీపీఓ శ్రీనివాసాచారి, ఉపాధి కల్పన అధికారి రాఘవేందర్, యువజన క్రీడల శాఖ అధికారి రాందాస్, పరిశ్రమల శాఖ అధికారులు హనుమంతు, భారతి, సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా పాల్గొన్నారు.

## నిర్మల్ జిల్లాలో ప్రశాంతంగా ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు

ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : నిర్మల్ జిల్లా వ్యాప్తంగా గురువారం నిర్వహించిన ఇంటర్మీడియట్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. మే 14వ తేదీన జరిగిన ఉదయం సెషన్ పరీక్షకు సంబంధించిన వివరాలను జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి పరశురాం వెల్లడించారు.

**పరీక్షలు గణాంకాలు :**

నేటి ఉదయం సెషన్ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా మొత్తం 1089 మంది విద్యార్థులు కేటాయించబడగా, వారిలో 1024 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. కాగా, 65 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరైనట్లు ఆయన తెలిపారు. జిల్లాలోని అన్ని పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు అత్యంత పకడ్బందీగా, ప్రశాంత వాతావరణంలో జరిగాయని డి.ఐ.ఇ.ఓ. పేర్కొన్నారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదని, నిబంధనల ప్రకారం పరీక్షలను విజయవంతంగా నిర్వహించామని ఆయన వివరించారు.

## ఇందిరమ్మ ఇళ్ళతో నిరుపేదలకు గూడు

కాంగ్రెస్ పార్టీ మండల ఇంచార్జి రావుల గంగారెడ్డి

ప్రజాపక్షం/ముథోల్ : ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణాలతో కొన్ని దశాబ్దాలుగా నిశ్చింతగా ఉండేలా కాంగ్రెస్ ప్రభుత్వంతో గూడులేని నిరుపేదలకు గూడు లభించిందని మండల కాంగ్రెస్ ఇంచార్జి రావుల గంగారెడ్డి స్పష్టం చేశారు. దీంతో వారికి ఆనందోత్సాహం కలుగుతోందన్నారు. గురువారం మండలంలోని ముద్గల్ నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని రిబ్బన్ కట్ చేసి గృహ ప్రవేశం చేశారు. పేదల కలలు సాకారం చేయాలంటే కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని అది ప్రజలు గుర్తించాలని పేర్కొన్నారు. ఏలాంటి ఆలస్యం కాకుండా బిల్లులు త్వరితగతిన లబ్దిదారుల ఖాతాల్లో జమ చేసి ఇచ్చిన హామీ ప్రకారం గూడులేని నిరుపేదలకు కొన్ని దశాబ్దాలు నిశ్చింతగా ఉండేలా ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణాలను మంజూరు చేయించారు. ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణాలతో ప్రతి పేదవాని కల నెరవేరేట్టు ప్రభుత్వం దిశా నిర్దేశంతో ముడుకెళ్తోందని తెలిపారు. ప్రజల ఆకాంక్ష మేరకు రాష్ట్రంలో పాలన సాగుతోందని గుర్తు చేశారు. ప్రజలకిచ్చిన ప్రతీ హామీని ప్రభుత్వం నెరవేర్చడానికి మార్గనిర్దేశ ఏజెండాతో ముందుకెళ్తోందన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్న నారాయణ రావు పటేల్‌కి మండల ఇంచార్జి రావుల గంగారెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన తండాలకు మహర్దశ

రోడ్ల నిర్మాణానికి రూ.15 కోట్ల రూ.25 లక్షల నిధులు మంజూరు

ఎం.ఎల్.ఏ. పవార్ రామారావ్ పటేల్



ప్రజాపక్షం/భైంసా : ముథోల్ నియోజకవర్గంలో గిరిజన తండాల్లో బి.టి. రోడ్ల నిర్మాణానికి 15 కోట్ల 25 లక్షల రూపాయల నిధులు మంజూరు కావడం జరిగిందని ఎం.ఎల్.ఏ. పవార్ రామారావు పటేల్ తెలియజేశారు. గురువారం ఎస్.ఎస్. జిన్నింగ్ ప్యాక్టరీ లోని ఆయన నివాసంలో మాట్లాడారు. తండాలు వెలిసినప్పటినుండి. బిటి. రోడ్లు లేక గిరిజన ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడ్డారని, ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకొని 14.20 కిలోమీటర్లు, పొడవునా తండాలు కలుపుతూ 7 రోడ్ల నిర్మాణం చేపట్టామన్నారు. జి.ఓ. నెం. 65 ప్రకారం ఐటిడిఏ ద్వారా ప్రభుత్వం పాలన పరమైన అనుమతులు ఇవ్వడం జరిగిందన్నారు. సర్పాపూర్ మండలంలో నందన్‌టు నందన్ తండా రోడ్డుకు కోటి రూపాయలు, బామ్ని టు బామ్ని తాండ రోడ్‌కు 2 కోట్ల రూపాయలు, కుబీర్ మండలంలో నిగ్వ టు పల్సి తండాకు 7 కోట్ల రూపాయలు, చాత టు చాత తండా 1కోట్ల 25 లక్షల రూపాయలు, కుంటాల మండలంలో దౌనెల్లి టు గంపూర్ తండాకు కోటి రూపాయలు, అంబకంటి హనుమాన్‌తండా రోడ్డు వంతెన నిర్మాణానికి 30 లక్షలు, మెదన్‌పూర్ టు మహదేవ్ తండాకు 2 కోట్ల 70 లక్షలు రూపాయల నిధులు మంజూరు కావడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, గిరిజన శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుకు కృతజ్ఞతలు చెప్పారు.

## కంటి వైద్యశిబిరం



**ప్రజాపక్షం/ముప్కాల్:** ముప్కాల్ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో స్థానిక భూదేవ్ ఇండోర్ స్టేడియంలో వేసవి కబడ్డీ శిక్షణ శిబిరం కొనసాగుతుంది. ఈ సందర్భంగా గురువారం రోజు ఉదయం ఎన్ఆర్ఐ నూతన దంపతులు మోతె సూరజ్‌రెడ్డి ఆయన సతీమణితో కలిసి పూజా కార్యక్రమాలు నిర్వహించామని కబడ్డీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.గంగాధర్ తెలిపారు. వేసవి కబడ్డీ శిక్షన శిబిరంలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు నూతన దంపతులు క్రీడా దుస్తులను అందజేశారు. దంపతులతో పాటు ఆయన సోదరుడు మోతె సురక్షిత్ రెడ్డి సతైం పాల్గొన్నారు. గతంలో కూడా సూరజ్‌రెడ్డి, సురక్షిత్‌రెడ్డి సోదరులు 35వ సబ్‌జూనియర్ బాలబాఇలకల రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఆర్థిక సాయం అందించిన విషయంను గుర్తు చేశారు. కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గంగాధర్ రెడ్డి, ముప్కాల్ స్పోర్ట్స్ అకాడమీ చైర్మన్ అంజయ్య, మోతె సూరజ్‌రెడ్డి, సురక్షిత్‌రెడ్డి, రమేష్, గంగారాం, కోచ్ సాయిలు, నర్సయ్య, సతీష్ పాల్గొన్నారు.

## విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



**ప్రజాపక్షం/ముప్కాల్ :** ప్రతి మనిషి సేవ దృష్టిలో కొనసాగాలని అప్పుడే వ్యక్తిత్వం ఉన్నతంగా మారుతుందని కర్ణ ఫౌండేషన్ ముఖ్యఅతిథి రాణా ప్రతాప్ అన్నారు. వేంపల్లి ప్రాథమిక పాఠశాలలో ఇటీవల నవోదయకు ఎంపికైన తేలు సహస్రను శాలువతో సన్మానం చేశారు. గురుకులానికి ఎంపికైన 28 మంది విద్యార్థులను అభినందించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు రంజిత్‌గౌడ్, చిట్టి పటేల్ ఎంపికైన విద్యార్థులకు, ప్రధానోపాధ్యాయులు శైవ శ్రీనివాస్ జ్ఞాపిక అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో గంగాప్రసాద్, ఎస్ఎంసీ సభ్యులు నవీన్, ఉపాధ్యాయ బృందం సతీష్, యశ్వంత్ పాల్గొన్నారు.

## స్పోర్ట్స్‌స్కూల్‌కు స్నితిక్ విద్యార్థి




**ప్రజాపక్షం/-ముప్కాల్ :** మండల కేంద్రానికి చెందిన కృష్ణవేణి ఉన్నత పాఠశాల విద్యార్థి బి.స్నితిక్ తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ (ఆదిలాబాద్)కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ప్రవీన్‌కుమార్ తెలిపారు. ఈ సం దర్భంగా పాఠశాల వైస్‌ప్రిన్సిపాల్ రాజేందర్, కరస్పాండెంట్, ఉపాధ్యాయ బృందం ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

# విద్యుత్ నగర్ పార్కు స్థలాన్ని కాపాడాలి!

### భూకబ్జాదారుల ప్రయత్నాలను అడ్డుకోవాలని కాలనీవాసుల విజ్ఞప్తి



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** హనుమకొండ నగరంలోని 49, 50 డివిజన్‌ల పరిధిలో ఉన్న విద్యుత్ నగర్ కాలనీలో సుమారు 2000 గజాల పార్కు స్థలాన్ని కొందరు భూకబ్జాదారులు గురువారం జేసీబీల సహాయంతో చదును చేసి ఆక్రమించడానికి ప్రయత్నించిన ఘటన స్థానికంగా ఆందోళన కలిగించింది. కాలనీవాసుల సమాచారం ప్రకారం పార్కు స్థలంగా కేటాయించిన డిపి నెంబర్ 970/1, 970 బై ఏ తేదీ12.8.1992 కూడా లేఅవుట్ అనుమతి ఇచ్చింది. ఈ భూమిపై కొంతకాలంగా కన్నేసిన కబ్జాదారులు అకస్మాత్తుగా యంత్రాలతో ప్రవేశించి భూమిని చదును చేయడం ప్రారంభించారు. ఈ విషయంపై స్థానికులు ప్రశ్నించగా "ఈ స్థలం మాదే, మాకు సంబంధిత పత్రాలు ఉన్నాయి" అంటూ దౌర్జన్యంగా వ్యవహరిస్తూ ఆక్రమణ చర్యలకు పాల్పడినట్లు కాలనీ అధ్యక్షులు రామ్ రెడ్డి ఆరోపిస్తున్నారు. గతంలో గ్రేటర్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ఈ స్థలానికి రక్షణగా ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టేందుకు గుంతలు తవ్వి పనులను మధ్యలోనే నిలిపివేయడంతో స్థలం నిర్లక్ష్యానికి గురైందని స్థానికులు తెలిపారు. అదే అదనుగా భావించిన భూకబ్జాదారులు ఇప్పుడు పార్కు స్థలాన్ని స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై సుబే దారి పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు వెంటనే స్పందించి సంఘటన స్థలానికి చేరుకొని భూకబ్జాదారులను అక్కడి నుండి వెళ్లగొట్టారు. ఈ స్థలంపై ఇరు వర్గాలు రుజువులు చూపించాలని. అప్పటి వరకు ఇక్కడ ఎవరు ఉండదని ఇది పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలోని భూమి అని పోలీసులు ఆక్రమణకు పాల్పడే వ్యక్తులను పంపించారు.విద్యుత్ నగర్ కాలనీలో పిల్లలు, వృద్ధులు, మహిళలకు ఉపయోగపడే ఏకైక పార్కు స్థలాన్ని కాపాడాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు స్పందించి ఆక్రమణ ప్రయత్నాలను అడ్డుకోవాలని, పార్కు స్థలానికి పూర్తి స్థాయిలో ప్రహరీ గోడ నిర్మించాలని, హరితహారం కింద మొక్కలు నాటి ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా అభివృద్ధి చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

# హాకా ఎరువుల సెంటర్ ప్రారంభం

### ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**ప్రజాపక్షం/చిట్యాల :** ప్రభుత్వం నిర్ణయించిన ధరలకె హాకా రసాయన ఎరువుల సెంటర్లో ఏరువులు అందుబాటులో ఉంటాయని రైతులందరు సద్వినియోగం చేసుకోవాలని భూపాలపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు.మండలంలోని ఏలేటి రామయ్యపల్లి గ్రామంలో గురువారం మద్రి వెంకటేష్ హాకా రసాయన ఎరువుల సెంటర్ ను నూతనంగా ఏర్పాటు చేయగా స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్యఅతిథిగా హాజరై హక సెంటర్ ను ప్రారంభించారు. అనంతరం గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో ఇలాంటి వ్యాపారాలు ప్రారంభం కావడం యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే కాకుండా ప్రజలకు అవసరమైన సేవలు గ్రామాలలోనే అందుబాటులోకి రావడం సంతోషకరమన్నారు.స్వయం ఉపాధి వైపు యువత ముందుకు రావాలని ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలు రుణ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.హక షాప్ ఏర్పాటు చేసుకున్న యజమాని వెంకటేశ్ ని ఎమ్మెల్యే శాలువాతో సన్మానించారు.మండలంలోని బాలమురుగన్ పత్తి మిల్లులో రైతులకు సంబంధించిన మక్కలను ప్రభుత్వం కొనుగోలు చేసి అందులో నిలువలు చేస్తున్న క్రమంలో ఎలాంటి అవకతకాలు చోటు చేసుకోకూడదని గురువారం భూపాలపల్లి ఎమ్మెల్యే జిఎస్ ఆర్ సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లో మక్కా రైతులను ఇబ్బందులకు గురి చేయకూడదని కాంటాలు సాఫీగా జరగాలని రైతులు ఎవరు అధర్య పడొద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్పర్సన్ గుమ్మడి శ్రీదేవి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు గూట్ల తిరుపతి, కార్యదర్శి గడ్డం కొమురయ్య, జిల్లా అధికార ప్రతినిధి దొడ్డికిష్టయ్య,చిలుకల రాయకొంరు,కట్కూరి నరేందర్,గంగాధర్ రాజు, సర్పంచ్ కొడారి అశోక్,కాంగ్రెస్ నాయకులు,రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## ల్యాండ్ సమస్యలను త్వరితగతిన పూర్తి చేయాలి

### ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** ల్యాండ్ సమస్యలను త్వరితగతిన పూర్తి చేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. గురువారం ఐడిఓసి కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి రెవెన్యూ, సర్వే, అటవీ తదితర శాఖల అధికారులతో బల్క్ ల్యాండ్ సమస్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బల్క్ ల్యాండ్ సమస్యల పరిష్కారానికి సమగ్ర సర్వే నిర్వహించి త్వరితగతిన నివేదికలు సమర్పించాలని అధికారులకు సూచించారు. అనేక సంవత్సరాలుగా భూమిని సాగు చేసుకుంటున్న అర్హులైన రైతులకు పట్టాలు మంజూరు చేసే అవకాశం ఉందని స్పష్టం చేశారు. అర్హులకు పట్టాలు అందించడం ద్వారా వారికి భూ హక్కులు లభించి, సామాజిక మరియు ఆర్థిక భద్రత పెరుగుతుందని తెలిపారు. ఇందుకోసం సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి, భూములపై సమగ్ర సర్వే చేపట్టి, అర్హుల వివరాలను ఖచ్చితంగా గుర్తించి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ, పారదర్శకంగా సర్వే ప్రక్రియను పూర్తి చేసి, అర్హులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

## జిల్లా కలెక్టర్‌కు సరస్వతీ పుష్కరాల ఆహ్వాన పత్రిక అందజేత

**ప్రజాపక్షం/కాళేశ్వరం:** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం క్షేత్రంలో ఈ నెల 21 నుండి జూన్ 1వరకు జరుగనున్న సరస్వతీ అంత్య పుష్కరాల సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మను ఆలయ ఈఓ మహేష్ ఆహ్వానం పలికారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయంలో గురువారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మను ఆలయ ఈఓ మహేష్, మర్యాదపూర్వకంగా కలిసి అంత్య పుష్కరాల ఆహ్వాన పత్రికను కలెక్టర్ కు అందజేసారు.



## మద్యపాన నిషేదిత గ్రామంగా గున్కుల్

**ప్రజాపక్షం/నిజాంసాగర్:** మహ్మద్‌నగర్ మండలంలోని గున్కుల్ గ్రామస్థులు తమ గ్రామాన్ని మద్యపాన నిషేదిత గ్రామంగా ప్రకటించారు. గ్రామ సర్పంచు గంగి రమేష్‌తో గ్రామస్థులు సమావేశమై ఈ బృహత్తర నిర్ణయం తీసుకున్నారు. తమ గ్రామంలో ఎలాంటి అల్లర్లు, గొడవలు, ఘర్షణలు జరగకుండా ఈ నిర్ణయం తీసుకున్నామని, తమ పిల్లల బంగారు భవిష్యత్తును ఆకాంక్షించామని వారు పేర్కొన్నారు. గ్రామంలో ఎవరైనా మధ్యాన్ని విక్రయిస్తే వారికి 10 వేల రూపాయల జరిమానా విదిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.

## నరసింహ స్వామి ఆలయంలో అమావాస్య శనివారం సందర్భంగా ఏర్పాట్లు పూర్తి



**ప్రజాపక్షం/ఎడపల్లి:** శనివారం అమావాస్య పురస్కరించుకొని రేపు జిల్లా నలుమూలల నుంచే కాకుండా మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి విచ్చేయనున్న భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లను పూర్తి చేస్తున్నట్లు ఆలయ ఇన్‌ఛార్జి కార్యనిర్వహణాధికారి వేణు తెలిపారు. ఎడపల్లి మండలం జాన్కంపేట్ గ్రామ శివారు గల శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో రేపు శనివారం స్వామి వారిని దర్శించుకుంటారు. దక్షణ భారత దేశంలోనే ప్రసిద్ధ గాంచిన అష్టముఖి కొనేరులో భక్తులు తరలివచ్చి పుణ్య స్నానాలు ఆచరించి నరసింహ స్వామిని దర్శించుకుంటే భక్తుల సకల పాపాలు హరించబడతాయని ఆలయ ఈఓ సూచిస్తున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఆలయ సిబ్బంది ఏర్పాట్లను చేస్తున్నారు.పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

## కుటుంబ కలహంతో మహిళ ఆత్మహత్య

**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని మేడిపల్లికి చెందిన గుండెల లక్ష్మి (59) కుటుంబ కలహంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్న ఘటన చోటుచేసుకుంది. ఈ మేరకు ఎస్ ఐ జి నవీన్ కుమార్ గురువారం తెలిపిన వివరాల మేరకు గత రెండు రోజుల క్రితం నువ్వులు ఆరబెట్టే విషయంలో భర్త రాజన్నతో లక్ష్మికి జరిగిన చిన్న గొడవ అనంతరం ఆమె ఇంటి నుంచి వెళ్లిపోయింది.అనంతరం రాజేశ్వరరావుపేట గ్రామ శివారులోని ఎస్సారెస్పీ వరద కాల్వలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు గుర్తించినట్లు ఎస్ఐ తెలిపారు.మృతురాలి చెల్లెలు ఆసరీ గౌరు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఎస్ఐ నవీన్ పేర్కొన్నారు.

## మండల సమస్యలపై బిజెపి కార్యవర్గం తీర్మానాలు



**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో నీ గుడేటి కాపు సంఘ భవనంలో భారతీయ జనతా పార్టీ మండల కార్యవర్గ సమావేశం గురువారం నిర్వహించారు.ఈ సమావేశానికి జిల్లా కార్యదర్శి పీసు రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.మండల ప్రధాన కార్యదర్శులు సుంచు రణధీర్, పంతంగి వెంకటేష్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మండల సమస్యలపై చర్చించి తీర్మానాలు చేశారు.ముఖ్యంగా ఇబ్రహీంపట్నం–ఫకీర్ కొండాపూర్ ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన రోడ్డు పనుల నత్తనడక, సతక్కపల్లి–డబ్బ రోడ్డు విస్తరణ పనులపై ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే గ్రామాల్లో మహిళా సంఘ భవనాలు కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మాణం జరుగుతున్నాయని ప్రజలకు తెలియజేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో శ్రీధర్ రెడ్డి, దేవన్న, శ్రీనివాస్,అశోక్,గణేష్, శేఖర్,నరేష్, సురేష్, మారుతి, కిరణ్, రాజారెడ్డి, మహేందర్ తదితర నాయకులు పాల్గొన్నారు.